


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684



విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575



| మేడ్చల్-మల్కాజ్‌గిరి | శుక్రవారం | 19.12.2025 | సంపుటి : 2 | సంచిక :314 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Friday | 19.12.2025 | volume : 2 | Issue : 314 | Pages : 8 | Cost : 2/- |


# పంచాయతీ ఫలితాలు

# మా పాలనకు గీటురాయి

## వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఇవే ఫలితాలు రిపీట్

రెండేళ్ల మా పాలన పట్ల ప్రజల్లో సానుకూలత

కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో సైతం ఆదరించారు

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఇవే ఫలితాలు రిపీట్ అవుతాయి

బిఆర్ఎస్, బిజెపి కూటమికి 3-శాతం కూడా సీట్లు దక్కలేదు

ఇప్పటికైనా బిఆర్ఎస్ బుద్ధిగా మసలుకోవాలి

మీడియా సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి



మూడు దశల్లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అద్భుతమైన ఫలితాలను సాధించిందని.. 2029 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు పునరావృతమవుతాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. పార్టీ విజయం కోసం కష్టపడిన కాంగ్రెస్ కార్యకర్తలందరికీ ధన్యవాదాలు తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులతో కలిసి సీఎం మాట్లాడారు.

హైదరాబాద్, డిసెంబర్ 18 : మూడు విడతల్లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అద్భుత ఫలితాలు సాధించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ గెలుపునకు కష్టపడిన కాంగ్రెస్ పార్టీ -మిగతా 2 లో..



## ఉపాధి హామీ చట్టం స్థానంలో

# వీబీ జీ రామ్ జీ

లోక్‌సభలో ఆమోదం

ప్రతులు చించి నిరసన తెలిపిన విపక్షం

వెల్‌లోకి దూసుకెళ్లి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన

మహాత్ముడి పేరు మార్పు దుర్మార్గమని విమర్శలు

గాంధీ ఆశయాలను ముందుకు తీసుకు వెళుతున్నమన్న శివరాజ్‌సింగ్ 02

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో 'వీబీ జీ రామ్ జీ' పేరుతో తీసుకువచ్చిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ప్రతిపక్ష ఎంపీల ఆందోళనలు, నిరసనల మధ్య ఈ బిల్లును ఆమోదించారు. అయితే, బిల్లును స్టాండింగ్ కమిటీకి పంపించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి నిరసన వ్యక్తం చేశారు. విపక్ష సభ్యుల నిరసనలపై స్పందించిన స్పీకర్.. ఓం బిర్లా బిల్లుపై సుదీర్ఘంగా చర్చించారని చెప్పారు.



## ప్రధాని మోడీకి

# ఆర్డర్ ఆఫ్ ఒమన్ పురస్కారం

న్యూఢిల్లీ, డిసెంబర్ 18 : భారత ప్రధాని నరేంద్ర మోదీకి అంతర్జాతీయ స్థాయిలో మరో అరుదైన గౌరవం దక్కింది. బుధవారం ఇథియోపియా అత్యున్నత పురస్కారాన్ని అందుకున్న ప్రధాని మోదీ.. మరుసటి రోజే మరో అరుదైన ఘనతను దక్కించుకున్నారు. ఒమన్ దేశం కూడా తన అత్యున్నత పౌర పురస్కారంతో ప్రధాని మోదీని గౌరవించడం విశేషం. ప్రధాని మోదీ తన మూడు దేశాల -మిగతా 2 లో..

# ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు..

## ముగ్గురు మావోయిస్టుల మృతి



ఛత్తీస్‌గఢ్ : ఛత్తీస్‌గఢ్‌లో భద్రతాబలగాలు, మావోయిస్టుల మధ్య గురువారం ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. సుక్మా జిల్లా గొల్లపల్లి అటవీప్రాంతంలో చోటుచేసుకున్న ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు -మిగతా 2 లో..



# కాంగ్రెస్, బీజేపీ రైతు వ్యతిరేక ప్రభుత్వాలు

రెండుసార్లు రైతు భరోసాకు ఎగనామం

మాజీ మంత్రి హరీష్‌రావు విమర్శలు

మెదక్, డిసెంబర్ 18 : రేవంత్ రెడ్డి వచ్చాక రెండు సార్లు రైతు భరోసా ఎగ్గొట్టారని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. వ్యవసాయానికి కరెంట్, నీళ్ల అవసరం అయితే కాంగ్రెస్ మాత్రం యాప్ లు, మ్యాప్ లు కావాలి అంటుందన్నారు. తాజాగా మెదక్‌లో ఆయన మాట్లాడారు. రేవంత్ రెడ్డి వచ్చాక బస్ ఛార్జీలు రెండేళ్లలో రెండింతలు పెరిగాయి.. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు రైతు వ్యతిరేక ప్రభుత్వాలని -మిగతా 2 లో..

# పంచాయతీ ఎన్నికల్లో ఎన్నెన్ని సిత్రాలో..

పసుపు బియ్యంపై ప్రమాణాలు

ఒకటి రెండు ఓట్లతో ఓటమి.. గెలుపు

టాస్ విజేతల్లో ఆనందోత్సాహాలు

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అనేక చిత్ర విచిత్రాలు జరిగాయి. ఒకే కుటుంబంలో కొందరు పరస్పరం పోటీ పడ్డారు. డబ్బులు ఇచ్చిన ఓటేయలేదని కొందరు ఆక్రోశించారు. పసుపు బియ్యం పట్టుకుని ప్రమాణం చేయించారు. దేవుడి ఫోటోమీద ప్రమాణాలు జరిగాయి. ఏతావాత ఓటింగ్ మాత్రం అద్భుతంగా సాగింది. ఒకటి, రెండు, మూడు ఇలా స్వల్ప ఓట్ల తేడాతో పలువురు అభ్యర్థులు గెలుపొందగా, మరికొందరు ఓటమి పాలయ్యారు. కొందరికి సమాన ఓట్లు రాగా టాస్ వేసి విజేతలను ప్రకటించారు.



## పార్టీ ఫిరాయింపులు

# స్పీకర్‌కు కనుబడటం లేదా

రాష్ట్రంలో చిల్లర రాజకీయాలు నడుస్తున్నాయి



రేవంత్ రెడ్డి మూడు ఫీట్లున్నా.. ముప్పై ఫీట్ల డైలాగులు కొడతాడు

ఓట్ల కోసం కేసీఆర్ ఏనాడు అబద్ధాలు చెప్పలేదు

సర్పంచ్ ఎన్నిక ఫలితాలతో వెయ్యి ఏనుగుల బలం

యాదాద్రి జిల్లాలో గెలిచిన సర్పంచ్‌ల అభినందనలో కేటీఆర్

భువనగిరి : రాష్ట్రంలో చిల్లర రాజకీయాలు నడుస్తున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లాలో నూతనంగా ఎన్నికలైన సర్పంచుల సన్మాన కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ' రాష్ట్రంలో -మిగతా 2 లో..



# ఫోన్ ట్యాపింగ్ కేసు

సీపీ సజ్జనార్ ఆధ్వర్యంలో మరో సిట్

**హైదరాబాద్:** ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఆధ్వర్యంలో సీనియర్ ఐపీఎస్ అధికారులతో మరో సిట్‌ను ఏర్పాటు చేస్తూ తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

మిగతా 3లో

## రూ.15వేల కోట్ల విలువైన భూమి

# తెలంగాణ ప్రభుత్వానిదే

సుప్రీంకోర్టు కీలక తీర్పు

తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. రూ.15వేల కోట్ల విలువ చేసే భూములకు సంబంధించి సర్వోన్నత న్యాయస్థానం కీలక తీర్పు ఇచ్చింది. హైదరాబాద్ వనస్థలిపురం సమీపంలోని సాహెబ్‌నగర్ వద్ద ఉన్న 102 ఎకరాల భూమి తెలంగాణ అటవీశాఖదేనని తేల్చింది. దాదాపు 20 ఏళ్లుగా ఈ భూ వివాదం కొనసాగుతోంది. 03





తెలంగాణ గ్రూప్-3

# ఫలితాలు విడుదల

03

బంగ్లాదేశ్‌లో..

రెండు వీసా కేంద్రాలను

# మూసివేసిన భారత్



06



## ప్రధాని మోడీకి మరో గౌరవం

(మొదటిపేజీ తరువాయి)

పర్యటనలో భాగంగా చివరిగా ఒమన్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య పలు ఒప్పందాలు ఖరారయ్యాయి. భారత్, ఒమన్ దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో చేసిన కృషికి గుర్తింపుగా ఒమన్ సుల్తాన్ హైతం బిన్ తారిక్.. మోదీకి 'ఆర్డర్ ఆఫ్ ఒమన్' పురస్కారాన్ని ప్రదానం చేశారు. 'ఆర్డర్ ఆఫ్ ఒమన్' అనేది ఒమన్, విదేశీయులకు ఇచ్చే అత్యంత విశిష్టమైన పౌర పురస్కారం.భారత్ – ఒమన్ దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మోదీ ఒమన్‌లో పర్యటిస్తున్నారు. కాగా, ప్రధాని మోదీ ఇప్పటివరకు వివిధ దేశాల నుంచి 29 అత్యున్నత పౌర పురస్కారాలను అందుకున్నారు. ఇటీవల కువైట్ ప్రభుత్వం కూడా 'ఆర్డర్ ఆఫ్ ముబారక్ అల్–కబీర్'తో ఆయనను గౌరవించింది. బుధవారం ఇథియోపియా తన అత్యున్నత పురస్కారమైన 'నిషాన్ ఆఫ్ ఇథియోపియా'తో ప్రధాని మోదీని సత్కరించింది.



### జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో

## 'వీబీ జీ రామ్ జీ' బిల్లు

(మొదటిపేజీ తరువాయి)

బిల్లు ప్రతులను చించి పడేశారు. వీరి ఆందోళనల మధ్యే బిల్లు ఆమోదం పొందినట్లు స్పీకర్ ప్రకటించారు. ఇక లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో.. ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా, డీఎంకే నాయకులు టీఆర్ బాలు, సమాజ్‌వాదీ పార్టీ నాయకులు ధర్మేంద్ర యాదవ్ సహా పలువురు విపక్ష పార్టీల సభ్యులు.. జీ రామ్‌జీ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. బిల్లుకు వ్యతిరేకంగా సభలో ఆందోళన చేపట్టారు. ఈ పథకానికి మహాత్మాగాంధీ పేరును తొలగించడం అంటే జాతిపితను అవమానించడమేనని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ బిల్లుతో రాష్ట్రాలపై మరింత భారం పడుతుందని ఆరోపించారు. మరోవైపు జీ రామ్‌జీ బిల్లును కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సమర్థించారు. బిల్లుపై లోక్‌సభలో మాట్లాడిన శివరాజ్ సింగ్.. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలకు నెహ్రూ పేరును పెట్టిందని గుర్తుచేశారు.



## ఘాట్ రోడ్డులో బ్రేక్ ఫెయిల్

### పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు.. డ్రైవర్ చాకచక్యంతో తప్పిన పెను ప్రమాదం

**ఆదిలాబాద్ :** ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం ఉమ్రి గ్రామపంచాయతీ, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం పరందోలి సరిహద్దున ఉన్న ఘాట్‌రోడ్డు మీదుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సు బ్రేకులు ఫెయిలయ్యాయి. డ్రైవర్ అప్రమత్తమై చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రయాణికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు (ఏపీ 25 జెడ్ 0067) గురువారం ఉదయం ఆదిలాబాద్ నుంచి కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పరందోలికి వెళ్లింది. తిరిగి ఆదిలాబాద్‌కు వస్తుండగా ఘాట్‌రోడ్డుపై బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. దీంతో డ్రైవర్ సంతోష్ అప్రమత్తతతో బస్సు ఘాట్ పైనుంచి లోయలోకి పడిపోకుండా పొదల్లోకి మళ్లించాడు. ప్రమాద సమయంలో బస్సులో 30 మంది ప్రయాణికులు ఉన్నారు. సంజీవ్ (ఉమ్రీ), రమాదేవి, నాందేవ్ (మహారాజ్‌గూడ)లకు గాయాలయ్యాయి. వారికి గాదిగూడ మండలం ఝరి ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి ఆదిలాబాద్ రిమ్స్‌కు మార్చారు. నార్నూర్ సీఐ అంజమ్మ ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ఘటనపై విచారణ చేపట్టారు.

### హ్యాండ్ బ్రేక్ కూడా ఫెయిలైంది..

పరందోలి గ్రామం నుంచి ఉదయం 9:30 గంటలకు 30 మందితో బయలుదేరామని డ్రైవర్ సంతోష్ తెలిపాడు. ఘాట్‌పైకి రాగానే ఆకస్మికంగా బ్రేకులు పనిచేయలేదని పేర్కొన్నాడు. దీంతో బస్సు కుడివైపు లోయలోకి పడేదని, వెంటనే అప్రమత్తమై ఎడమవైపు తిప్పి పొదల్లోకి తీసుకెళ్లానని పేర్కొన్నాడు. పత్తి చేలలో బస్సు ఆగిపోవడంతో పెను ప్రమాదం తప్పిందని వెల్లడించారు. ప్రమాద సమయంలో బస్సు హ్యాండ్ బ్రేక్‌కూడా పనిచేయలేదని డ్రైవర్ తెలిపాడు.

# వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఇవే ఫలితాలు రిపీట్

(మొదటిపేజీ తరువాయి)

కార్యకర్తలకు శుభాకాంక్షలు చెప్పారు. ఈ పంచాయతీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించిన అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. 12,702 పంచాయతీలకు గాను 7,527 పంచాయతీల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచిందన్నారు. 808 కాంగ్రెస్ రెబల్స్ నెగ్గారని వివరించారు. 66 శాతం ఫలితాలను కాంగ్రెస్ సాధించిందని తెలిపారు. 3,511 కాంగ్రెస్ , 710 బీజేపీ మొత్తంగా 33 శాతం గెలిచాయని పేర్కొన్నారు. 94 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికలు జరిగాయని.. 87 నియోజక వర్గాల పరిధిలో కాంగ్రెస్ మెజారిటీ సాధించిందని స్పష్టం చేశారు. పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయన్నారు. తమ ప్రభుత్వంపై ప్రజలు సంపూర్ణ విశ్వాసం కనబరిచారని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ కూటమిగా పోటీ చేశాయని ఆరోపించారు. ÷ఖఆర్ఎస్, బీజేపీ కూటమికి 33శాతం విజయాలు మాత్రమే దక్కాయన్నారు. బీఆర్ఎస్‌కు 3,511 సర్పంచ్ స్థానాలు, బీజేపీ 710 చోట్ల గెలిచాయని చెప్పారు. బీఆర్ఎస్, బీజేపీ కూటమికి 4,221 స్థానాలు మాత్రమే దక్కాయని సీఎం రేవంత్ తెలిపారు. ఇటీవల ప్రజాపాలన రెండేళ్ల సంబురాలు నిర్వహించుకున్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలోని 12వేలకు పైగా గ్రామపంచాయతీల్లో ఎన్నికలు ప్రశాంతంగా, ప్రజాస్వామ్య బద్ధంగా జరిగాయి. ఎన్నికలు సజావుగా నిర్వహించిన అధికారులకు అభినందనలు తెలిపారు. దాదాపు 146 గ్రామ పంచాయతీలు (ఒక శాతం) సీపీఐ, సీపీఎం, ఇతరులు గెల్చుకున్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లయిన తర్వాత జరిగిన ఎన్నికల్లోనూ ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలు మా రెండేళ్ల పాలనపై తీర్పుగా భావిస్తున్నాం అని సిఎం అన్నారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనే పెద్దల సూచనను పాటిస్తాం. కానీ, ప్రతిపక్షంలో ఉన్న వారికి ఇంకా అహంకారం తగ్గలేదు. ఇప్పటికైనా ప్రజా తీర్పును గౌరవించి.. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు సహకరించాలని రేవంత్ రెడ్డి అన్నారు. పేదలకు మేం అందిస్తున్న సంక్షేమ పథకాలే మా విజయానికి కారణం. ఈ ఫలితాలను చూసి భారత రాష్ట్ర సమితి నేతలు అద్భుతం అంటున్నారు. సంతోషం.. మీరు కోరుకున్నట్టే ఈ అద్భుతం 2029లో కూడా జరుగుతుంది. 2/3 మెజార్టీతో 2029లో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వస్తుంది. 1/3తో భారత రాష్ట్ర సమితి ఉంటే.. 2/3 మెజార్టీతో కాంగ్రెస్ ఉంటుంది. ఈ తీర్పు 2029లో కూడా పునరావృతం కాబోతోందని సీఎం అన్నారు.

## ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలపై త్వరలో నిర్ణయం

- అందరితో చర్చించి ఓ నిర్ణయానికి వస్తాం
- ఎన్నికలు సజావుగా నిర్వహించిన అధికారులకు కృతజ్ఞతలు
- మీడియా సమావేశంలో సిఎం రేవంత్ వెల్లడి



**హైదరాబాద్, డిసెంబర్ 18 :** రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతమైన వాతావరణంలో, ప్రజాస్వామిక బద్ధంగా ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించినందుకు ఎన్నికల యంత్రాంగానికి, అధికారులకు ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లను సాధించడంపై శాసనసభ సమావేశాల్లో చర్చించి అన్ని పార్టీల అభిప్రాయం మేరకు ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలపై నిర్ణయానికి వస్తామని చెప్పారు. రాష్ట్రంలో 12,728 పంచాయతీలకు గాను 12,702 గ్రామ పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు జరగ్గా, ప్రజాస్వామిక బద్ధంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడం, ప్రజలు స్వేచ్ఛగా తీర్పును ఇవ్వడం అభినందనీయమని అన్నారు. ఈ ఎన్నికల నిర్వహణలో అధికారులు స్వేచ్ఛగా పనిచేశారని అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించినందుకు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహరు, ధనసరి అనసూయ సీతక్కలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం రెండేళ్ల పరిపాలన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలతో ప్రజల ముందుకు వెళ్లగా, తమకు 7,527 గ్రామ పంచాయతీల్లో (66 శాతం) ప్రజలు అందించిన ఆశీర్వాదం.. ప్రభుత్వంపై మరింత బాధ్యత పెంచిందని చెప్పారు. ప్రజల ఆశీర్వాదంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండిండినీ సమపాళ్లలో ముందుకు తీసుకెళుతున్నామని అన్నారు. రాష్ట్రంలో కొత్తగా రేషన్ కార్డుల జారీ, సన్నబియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ, రైతు భరోసా, సన్నధాన్యానికి బోనస్ చెల్లింపు, ఉచిత కరెంట్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, రూ. 500 లకే సిలిండర్, 27వేల కోట్ల రూపాయల మేరకు సున్నా వడ్డీకే మహిళా సమాఖ్యలకు రుణాలు, 4.5 లక్షల మంది నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే 61 వేల ఉద్యోగాల భర్తీ, సుదీర్ఘకాలం అపరిష్కృతంగా ఉన్న ఎస్సీ వర్గీకరణ సమస్యకు పరిష్కారం, వందేళ్లుగా జరగని బీసీ కులగణన చేపట్టడం, పేదలకు మంచి విద్యను అందించాలన్న ప్రయత్నాలు... ఇలా అనేక అంశాల్లో ప్రభుత్వం ఒక క్రమపద్ధతిలో అభివృద్ధిని, సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు వెళుతోందని ముఖ్యమంత్రి వివరించారు. ఒకవైపు ఆదాయాన్ని పెంచుకుంటూ దుబారాను తగ్గిస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని, ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం జరక్కుండా ప్రజలకు మేలు చేయాలన్నదే ప్రభుత్వ తాపత్రయమని ఒక ప్రశ్నకు సమాధానంగా ముఖ్యమంత్రి గారు చెప్పారు. కృష్ణా, గోదావరి జలాలపై తెలంగాణ హక్కులకు సంబంధించి పూర్తి వివరాలతో శాసనసభలో చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.

## రాష్ట్రంలో చిల్లర రాజకీయాలు నడుస్తున్నాయి



(మొదటిపేజీ తరువాయి)

చిల్లర రాజకీయాలు నడుస్తున్నాయి. బీఆర్ఎస్ కార్యకర్తలను అరెస్ట్ చేసి స్టేషన్ కు తీసుకెళ్లి వేధించారు. చిన్నకాపర్తిలో బ్యాలెట్ పేపర్లను పడేశారు. రాష్ట్రంలో 100–150 గ్రామాల్లో బీఆర్ఎస్ గెలిచినా కాంగ్రెస్ గెలిచినట్లు ప్రకటించారు. ఈ వ్యవహారంపై ఖచ్చితంగా కోర్టుకు వెళ్తాం. పార్టీ ఫిరాయింపులు స్పీకర్‌కు కనుబడటం లేదా.. పార్టీ మారిన వాళ్లే సిగ్గులేకుండా చెప్పినా స్పీకర్‌కు వినపడటం లేదట. పది మంది ఎమ్మెల్యేలు ఆడనా మగనా అని కూడా చెప్పుకోవడం లేదు. ఏ పార్టీనో చెప్పుకోవడం లేదు. 70 ఏళ్లు నిండిన పోచారం శ్రీనివాస్ రెడ్డికి పార్టీ మారాల్సిన అవసరం ఏం వచ్చింది. అసెంబ్లీలో మొఖం చాటేస్తున్నారు. రేవంత్ రెడ్డి మూడు ఫీట్లున్నా ముప్పై ఫీట్ల డైలాగులు కొడతాడు. అడ్డుమారి గుడ్డిదెబ్బలో రేవంత్ సీఎం అయిండు. కేసీఆర్ పై కాంగ్రెస్, బీజేపీ వాళ్లకు కూడా కోపం లేదు. జనవరిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడదాం. కేసీఆర్ హయాంలో కేంద్రం ఉత్తమ పంచాయతీల అవార్డులు ఇస్తే తెలంగాణకే 30 శాతం వచ్చాయి. రేవంత్ రెండుసార్లు రైతుబంధు ఎగ్గొట్టాడు. ప్రభుత్వాన్ని నడిపేందుకు రేవంత్ కు చేతకావడం లేదు. కరోన సమయంలో ఏ సంక్షేమ పథకం ఆగలేదు. కేసీఆర్ సీఎం అయ్యే నాటికి 72 వేల కోట్ల అప్పు ఉంది. పదేళ్ల తర్వాత రెండు లక్షల ఎనభై వేల కోట్లు అప్పు అయిందని కాగ్ చెప్తోంది.. కానీ కాంగ్రెస్ మంత్రులు మాత్రం ఆరేడు లక్షల కోట్ల అప్పు అంటూ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. ఏనాడు ఓట్ల కోసం కాంగ్రెస్ నేతల్లా కేసీఆర్ అబద్ధాలు చెప్పలేదు. బీఆర్ఎస్ గెలిచిన చోట్ల సంక్షేమ పథకాలు అమలు చేయమని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అంటున్నారు.. అదేం రేవంత్ అత్త సొమ్ము కాదు.. రేవంత్ డబ్బులు ఇవ్వడం లేదని ప్రపంచ బ్యాంకుకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉత్తరం రాస్తున్నారు. ప్రతీ జిల్లాలో లీగల్ సెల్ ఏర్పాటు చేస్తాం. సర్పంచులపై కేసులు వేసినా భయపడాల్సిన పరిస్థితి లేదు' అని విమర్శించారు.



### రెండుసార్లు రైతు భరోసాకు

## ఎగనామం

(మొదటిపేజీ తరువాయి)

ఆరోపించారు. రైతులకు యూరియా సరిపడ రెండు ప్రభుత్వాలు ఇవ్వట్లేదు.. కాంగ్రెస్ చేసే తుగ్లక్ పనులతో కౌలు రైతులు, రైతుల మధ్య పంచాయితీ జరుగుతుందని విమర్శించారు. ఎరువుల కోసం యాప్ తెచ్చి రైతులను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తుంది.. సింగూరు ప్రాజెక్టుపై ఆధారపడ్డ రైతులకు క్లారిటీ ఇవ్వాలన్నారు. ఒక వేళ నీళ్లు ఇవ్వకుంటే ప్రకటన విడుదల చేసి నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు అడుగడుగునా కష్టాలే.. ఈ రోజు వరకు కూడా 40 శాతం రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందని చెప్పారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతు అంశాల్లో ఫెయిల్ అయ్యిందని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. 'యాసంగి 1200 కోట్ల బోనస్, వర్షాకాలం రూ. 600 కోట్ల బోనస్ నగదు ఇప్పటి వరకు ఇవ్వలేదు.. రైతు భరోసా ఇప్పటివరకు ఇవ్వలేదు.. మెదక్ రైతులు అగమ్యగోచరంగా ఉన్నారు.. ఘనపురం అనకట్ట నుంచి యాసంగి పంటకు నీళ్లు ఇస్తారా లేదా క్లారిటీ లేదు.. సింగూరు ప్రాజెక్టు మరమ్మతుల పేరిట నీళ్లు ఖాళీ చేస్తున్నారు.. గత వేసవిలో ప్రాజెక్టు మరమ్మతులు చేసే అవకాశం ఉన్నా చేయలేదు.. ప్రభుత్వం నుంచి స్పష్టత కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.. సింగూరు ప్రాజెక్టు ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాలో వ్యవసాయానికి జీవనాధారం.. పదేళ్ల ఃఖా పాలనలో బోరు బండ్లు లేవు.. ఇప్పుడు మళ్ళీ బోరు బండ్లు వచ్చాయి..' అని వ్యాఖ్యానించారు.

## రాష్ట్ర ఆర్థిక విధానాలు భేష్

- ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా
- సీఎం రేవంత్‌రెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ



**హైదరాబాద్:** రాష్ట్రంలో అనుసరిస్తున్న ఆర్థిక విధానాలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రశంసించారు. ఆర్థిక క్రమశిక్షణతో పాటు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమతుల్యంగా అమలు చేస్తున్న తీరు ఆదర్శనీయంగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) బోర్డ్ మీటింగ్‌కు హాజరయ్యేందుకు గురువారం హైదరాబాద్‌కు వచ్చిన ఆయన జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆర్థిక విధానాలు, సంస్కరణలపై విస్తృతంగా చర్చించారు. బ్యాంకింగ్ వ్యవస్థ మరింత పారదర్శకంగా ఉండాలన్న అంశంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన కీలక సంస్కరణలను వివరించారు. ముఖ్యంగా విద్యుత్ రంగంలో చేపడుతున్న సంస్కరణలు, మూడో డిస్కం ఏర్పాటు ప్రతిపాదన, విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చే చర్యలను ముఖ్యమంత్రి వెల్లడించారు. అలాగే సోలార్ విద్యుత్ వినియోగాన్ని పెంచే దిశగా ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, పునరుత్పాదక శక్తి రంగంలో పెట్టుబడులను ఆకర్షించే విధానాలను కూడా తెలియజేశారు. కాగా, బడ్స్ యాక్ట్‌ను నోటిఫై చేయాలని ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా ముఖ్యమంత్రిని కోరారు. రాష్ట్రం మరిన్ని సంస్కరణలు, వినూత్న ప్రణాళికలతో ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. యూనిఫైడ్ లెండింగ్ ఇంటర్‌ఫేస్ (యూఎల్ఐ) అంశంలో ఆర్‌బీఐ తీసుకుంటున్న చొరవను సీఎం దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ, ప్రైవేటు డిపాజిట్లకు సంబంధించిన క్లెయిమ్ క్యాంపెయినింగ్ కార్యక్రమాలపై కూడా వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, ఫైనాన్స్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఆర్‌బీఐ హైదరాబాద్ రీజినల్ డైరెక్టర్ చిన్మోయ్ కుమార్, జనరల్ మేనేజర్లు మేజర్ యశ్పాల్ చరణ్, ఎస్. పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు..

(మొదటిపేజీ తరువాయి)

మావోయిస్టులు మృతి చెందారు. మృతులను మావోయిస్టు పార్టీ కిష్టారం ఏరియా కమిటీకి చెందినవారిగా గుర్తించారు. మృతి చెందిన వారిలో మద్వి జోగ, సోది బండి, నుప్పో భజ్జీ ఉన్నారు. ఎస్పీ కిరణ్ చవాన్ ఈ ఘటనను ధ్రువీకరించారు. గొల్లపల్లి ప్రాంతంలో మావోయిస్టు కార్యకలాపాలు కొనసాగుతున్నాయనే సమాచారం ఆధారంగా బలగాలు ఆపరేషన్ చేపట్టాయి. అటవీ పర్వత ప్రాంతాన్ని డీఆర్‌జీ సిబ్బంది చుట్టుముట్టారు. ఎదురుకాల్పులు ఇంకా కొనసాగుతున్నట్లు, అనేకమంది మావోయిస్టులు గాయపడినట్లు సమాచారం.

# నదీ జలాలలపై బీఆర్ఎస్ ద్రోహం

- దమ్ముంటే కేసీఆర్ చర్చకు రావాలి
- అసెంబ్లీలో ఎప్పుడైనా చర్చిస్తాం
- మీడియా ముందుకు వచ్చినా వివరిస్తాం
- కేసీఆర్‌కు సీఎం రేవంత్ రెడ్డి సవాల్



**హైదరాబాద్, డిసెంబర్ 18 :** నదీజలాల విషయంలో ద్రోహం చేసిందెవరో మీడియా ముందకు వస్తే నిజాలు వెల్లడిస్తానని సిఎం రేవంత్ సవాల్ చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కి సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. నదీ జలాల విషయంలో మాట్లాడేందుకు కేసీఆర్ మీడియా ముందుకు రానున్నారని వార్తలు వస్తున్న నేపథ్యంలో.. సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. నదీ జలాలు, ప్రాజెక్టులపై చర్చిద్దాం రండి అంటూ కేసీఆర్‌కు ముఖ్యమంత్రి ఛాలెంజ్ విసిరారు. కేసీఆర్ ఎప్పుడు కోరితే అప్పుడు అసెంబ్లీ సమావేశాలు పెడతానని అన్నారు. బురదజల్లి పారిపోవడం కాదు.. నీటి వాటాల్లో ఎవరి హయాంలో అన్యాయం జరిగిందో చర్చిద్దాం రావాలంటూ కేసీఆర్‌కు సవాల్ విసిరారు. కృష్ణా జలాలపై ప్రతిపక్ష నేతగా లేఖ రాయండి. కృష్ణా జలాల్లో ఎవరు అన్యాయం చేశారో చర్చకు సిద్ధం. గోదావరి, కృష్ణా జలాలపై సభలో చర్చకు సిద్ధంగా ఉన్నాం. ఉమ్మడి రాష్ట్రంలో కంటే బీఆర్ఎస్ హయాంలోనే ఎక్కువ ద్రోహం చేశారు. మీరు చేసిన ద్రోహాన్ని ఆధారాలతో సహా నిరూపిస్తాం అని రేవంత్ అన్నారు. తెలంగాణలో పంచాయతీ ఎన్నిక పోరు ముగిసింది. ఈ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ హవా చాటింది. పెద్ద సంఖ్యలో సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా గురువారం నాడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీడియా ముందుకు వచ్చారు. కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లకు శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు.. రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాలపైనా కీలక కామెంట్స్ చేశారు. కేటీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత జరిగిన ఏ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ పార్టీ గెలవలేదని సీఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. కేటీఆర్‌ను తప్పించాలని హరీష్ రావు వర్గం సోషల్ మీడియాలో ప్రచారం మొదలు పెట్టిందని.. అందుకే ఆ విషయం చర్చకు రాకుండా కేటీఆర్ జిల్లాల పర్యటనలు మొదలు పెట్టారని అన్నారు. ఇదిలాఉంటే.. ఫార్ములా ఈ రేస్ కేసుపైనా సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసుపై దర్యాప్తు జరుగుతోందన్నా రు. అరవింద్ కుమార్‌కు సంబంధించి అనుమతి రావాల్సి ఉంద న్నారు. డీవోపీటీ నుంచి అనుమతి రాగానే చర్యలు తీసుకుంటామని సీఎం తెలిపారు. మెస్సీ ఈవెంట్ పూర్తిగా ప్రైవేట్ కార్యక్రమం అని సీఎం మరోమారు స్పష్టం చేశారు. మెస్సీ ఈవెంట్‌కు తాను గెస్ట్ మాత్రమేనని చెప్పారు. సింగరేణి యాజమాన్యం అడ్వర్‌టైజ్‌మెంట్ ఇచ్చిందన్నారు. ఫుట్‌బాల్ ఆడించాలనే తన మనవడిని తీసుకెళ్లినట్లు సీఎం వివరించారు. తాము పబ్బులు, గబ్బుల చుట్టూ తిప్పలేదన్నారు.



## రూ.15వేల కోట్ల విలువైన భూమి తెలంగాణ ప్రభుత్వానిదే

### సుప్రీంకోర్టు కీలక తీర్పు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 18 :** తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. రూ.15వేల కోట్ల విలువ చేసే భూములకు సంబంధించి సర్వోన్నత న్యాయస్థానం కీలక తీర్పు ఇచ్చింది. హైదరాబాద్ వనస్థలిపురం సమీపంలోని సాహెబ్‌నగర్ వద్ద ఉన్న 102 ఎకరాల భూమి తెలంగాణ అటవీశాఖదేనని తేల్చింది. దాదాపు 20 ఏళ్లుగా ఈ భూ వివాదం కొనసాగుతోంది. ఈ భూమిపై యాజమాన్య హక్కులు కోరుతూ నిజాం, సాలార్ జంగ్, మీరాలం వారసులమంటూ పలువురు న్యాయస్థానంలో పిటిషన్లు దాఖలు చేశారు. గతంలో పిటిషన్లు వేసిన 260 మందికి అనుకూలంగా హైకోర్టు తీర్పు ఇచ్చింది. హైకోర్టు తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీలు చేసింది. సుదీర్ఘ విచారణ అనంతరం జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిల ధర్మాసనం.. ఇది పూర్తిగా అటవీ భూమి అని రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి హక్కులు కల్పిస్తూ తీర్పు ఇచ్చింది. తీర్పు వెలువడిన 8 వారాల్లో రిజర్వ్ ఫారెస్ట్‌గా నోటిఫై చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సుప్రీంకోర్టు ఆదేశించింది. నోటిఫికేషన్ ప్రతిని సుప్రీంకోర్టు రిజిస్ట్రీకి పంపాలని ధర్మాసనం ఆదేశించింది.

## నేడు నగరానికి కేంద్ర ఎన్నికల కమిషనర్ రాక

**హైదరాబాద్, డిసెంబర్ 18 :** భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ శుక్రవారం హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో హైదరాబాద్ విమానాశ్రయానికి వస్తారు. ఆ తర్వాత.. సాయంత్రం ప్రసిద్ధ ఆధ్యాత్మిక కేంద్రమైన శ్రీశైలానికి బయలుదేరి వెళతారు. శనివారం ఉదయం శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో మహా హారతి కార్యక్రమంలో పాల్గొని, స్వామివారిని దర్శించుకోనున్నారు. ఈ సందర్శనలో హైదరాబాద్‌లోని చారిత్రక ప్రదేశాలైన గోల్కొండ కోట, చార్మినార్, సాలార్ జంగ్ మ్యూజియం వంటి వాటినీ సందర్శించే అవకాశం ఉంది. అనంతరం.. డిసెంబర్ 21న హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో తెలంగాణకు చెందిన బూత్ లెవల్ ఆఫీసర్ల తో జ్ఞానేష్ కుమార్ సమావేశమై.. ఎన్నికల పక్రియపై మార్గదర్శకాలు, దిశానిర్దేశం చేయనున్నారు. ఈ సమావేశం ఎన్నికల విధానాలను మరింత బలోపేతం చేయడంలో కీలకపాత్ర పోషించే అవకాశముందని తెలుస్తోంది. సీఈసీ జ్ఞానేష్ కుమార్ సందర్శన రాష్ట్ర ఎన్నికల యంత్రాంగానికి మరింత ఊతమివ్వనుందని అధికారులు భావిస్తున్నారు. అదేరోజు రాత్రి తిరిగి ఢిల్లీ వెళతారు.

## కార్మికుల షెడ్డులో అగ్నిప్రమాదం

- సిలిండర్లు పేలడంతో భారీగా ఎగిసిపడ్డ మంటలు
- కార్మికులు పనుల్లో ఉండడంతో తప్పిన ముప్పు



**హైదరాబాద్, డిసెంబర్ 18 :** షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగి మంటలు ప్రమాదకరంగా మారిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, ఫైర్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపల్లిలో కొనసాగుతున్న క్యాండూర్ భారీ బహుళ అంతస్థుల నిర్మాణానికి పనులు చేసే కార్మికుల షెడ్లలో గురువారం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలు ఒక్కసారిగా పెద్ద ఎత్తున ఎగిసిపడడంతో షెడ్లలో ఉండే కార్మికులు వంట గ్యాస్ భారీ శబ్దాలు చేస్తూ పేలిపోయాయి. ప్రమాదం జరిగిన సమయంలో అధిక సంఖ్యలో కార్మికులు విధుల్లో ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. నిర్మాణ సంస్థ ఉద్యోగుల సమాచారంతో రంగంలోకి దిగిన మాదాపూర్, పటాన్‌చెరువు ఫైర్ అధికారులు 3 గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అగ్నిప్రమాదంలో కార్మికులకు సంబంధించిన సామాగ్రి పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. శేరిలింగంపల్లిలో అత్యధిక అంతస్థులతో నిర్మాణాన్ని చేపట్టిన క్యాండూర్ నిర్మాణ సంస్థ, తమ వద్ద పని చేస్తున్న కార్మికుల జాగ్రత్తను గాలికొదిలేసిందని, ఒకే చోట రేకుల షెడ్లను నిర్మించి వందలాది మందిని ఇరుకు గదులలో ఉంచిందని కార్మిక సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవలే చందానగర్‌లో నిర్మాణ కార్మికుల షెడ్లు అగ్నిప్రమాదంలో కాలిబూడిదైన సంఘటన మరువకముందే మరో ఘటన చోటు చేసుకోవడం బాధకరమని విచారం వ్యక్తం చేశారు. ప్రాణ నష్టం జరిగితే తప్ప అధికారులు నిర్మాణ సంస్థలపై చర్యలు తీసుకోరంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.



## కట్నం కోసం భార్యను హతమార్చిన భర్త

**తాండూరు :** ప్రేమ వివాహం చేసుకొని ఏడాది కూడా దాటకముందే అదనపు కట్నం కోసం భార్యను కొట్టి చంపాడో భర్త. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని సాయిపూర్‌కు చెందిన పరమేశ్‌తో అనూష(22)కు 8 నెలల క్రితం వివాహమైంది. ఇద్దరూ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అనంతరం భర్త, అత్త మామలతో కలిసి ఉంటోంది. కొన్ని రోజులుగా కట్నం తేవాలని అత్త, మామ, భర్త వేధించడం ప్రారంభించారు. 3 రోజుల క్రితం భర్త పరమేశ్ దాడి చేయడంతో అనూషకు గాయాలయ్యాయి. తల్లి, సోదరుడు తీసుకెళ్లి చికిత్స చేయించారు. గురువారం సోదరుడితో కలిసి పుట్టింటికి వెళుతున్న అనూషను పరమేశ్ వచ్చి ఇంటికి తీసుకెళ్లాడు. ఇంటికి వెళ్లాక మరోసారి ఇద్దరూ గొడవ పడ్డారు. భర్త పరమేశ్ తీవ్రంగా కొట్టడంతో అపస్మారక స్థితికి చేరుకుంది. స్థానికులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. బాధితురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## రైలు బోగీలో మంటలు

**హైదరాబాద్, డిసెంబర్ 18 :** హైదరాబాద్ నుంచి బెళగావి వెళ్తున్న స్పెషల్ రైలు బోగీల కింద ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి రైల్వేస్టేషన్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. మంటలను గమనించిన రైల్వే సిబ్బంది వెంటనే రైలును నిలిపివేసి.. మంటలను అదుపులోకి తీసుకువచ్చింది. ఒక్కసారిగా ఉన్నట్టుండి రైలులో మంటలు రావడంతో ప్రయాణీకులు ఆందోళనకు గురయ్యారు. అయితే, ఎవరికీ ఏమీ కాకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయ్యింది. బ్రేక్ జామ్ అవడం వల్లే మంటలు చెలరేగి ఉంటాయని భావిస్తున్నారు. మంటలను అదుపులోకి తీసుకువచ్చిన తర్వాత రైలు తిరిగి బెళగావికి బయలుదేరి వెళ్లింది. ఈ ప్రమాదానికి సంబంధించి ఇంకా పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

## ఫోన్ ట్యాపింగ్ కేసు

### సీపీ సజ్జనార్ ఆధ్వర్యంలో మరో సిట్



**హైదరాబాద్:** ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఆధ్వర్యంలో సీనియర్ ఐపీఎస్ అధికారులతో మరో సిట్‌ను ఏర్పాటు చేస్తూ తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. సిట్‌లో రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ, సిద్దిపేట కమిషనర్ ఎస్.ఎం.విజయ్ కుమార్, మాదాపూర్ డీసీపీ రితురాజ్, మహేశ్వరం డీసీపీ నారాయణ్‌రెడ్డి, గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్ రవీందర్‌రెడ్డి, రాజేంద్రనగర్ అదనపు డీసీపీ కేఎస్ రావు, జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి, టీజీ న్యాబ్ డీఎస్పీ శ్రీధర్, హైదరాబాద్ మెట్రోలో పనిచేస్తున్న నాగేందర్ సభ్యులుగా ఉన్నారు.

## అసౌకర్యానికి గురైన నిధి అగర్వాల్..

### వారిపై కేసు నమోదు

**హైదరాబాద్ :** 'ది రాజాసాబ్' సాంగ్ లాంచ్ ఈవెంట్ వేళ వందల మంది అభిమానులు సెల్ఫీ కోసం ఎగబడటంతో నటి నిధి అగర్వాల్ అసౌకర్యానికి గురైన సంగతి తెలిసిందే. ఓ మాల్‌లో నిర్వహించిన వేడుక పూర్తయ్యాక బయటకు వస్తుండగా.. ఆమెపై కొందరు అసభ్యంగా ప్రవర్తించారు. సంబంధిత వీడియో నెట్టింట చక్కర్లు కొట్టింది. ఈ ఘటనపై కేపీహెచ్‌బీ పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేశారు. మాల్, ఈవెంట్ నిర్వాహకులు అనుమతి తీసుకోలేదని ఎస్‌హెచ్‌వో రాజశేఖర్ రెడ్డి తెలిపారు.




## కోర్టు సమయం వృథా చేస్తారా?

### హీరాగ్రూప్‌నకు భారీ జరిమానా విధించిన హైకోర్టు

**హైదరాబాద్:** నౌహీరా షేక్‌కు చెందిన హీరా గ్రూప్‌నకు హైకోర్టు భారీ జరిమానా విధించింది. రూ.5 కోట్ల జరిమానా విధించిన న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక... ఆ మొత్తాన్ని 8 వారాల్లో పీఎం సహాయ నిధికి జమ చేయాలని హీరా గ్రూప్‌ను ఆదేశించారు. కోర్టును తప్పుదోవ పట్టించేలా పిటిషన్ దాఖలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయమూర్తి.. భారీ జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పేదల నుంచి పెట్టుబడి పేరుతో డబ్బులు వసూలు చేసి తిరిగి చెల్లించలేదని హీరా గ్రూప్‌తో పాటు.. నౌహీరా షేక్ పైనా ఈడీ అధికారులు పీఎంఎల్ఏ కింద కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారులు హీరా గ్రూప్‌నకు చెందిన 59 ఆస్తులను అటాచ్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ ఆస్తులను వేలం వేసేందుకు ఈడీ అధికారులు లిమిటెడ్ వెబ్ సైట్‌లో వివరాలు ఉంచారు. ఈనెల 26న వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఈడీ అధికారులు సరిగా వేలం నిర్వహించడం లేదని, ఆస్తుల విలువ తక్కువగా చూపించారని నౌహీరా షేక్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వేలాన్ని రద్దు చేయాలని కోరారు. అప్పటి వరకు వేలం వేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక విచారణ చేపట్టారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వేలం వేస్తున్నట్లు ఈడీ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఇరువైపులా వాదనలు విన్న జస్టిస్ నగేశ్ భీమపాక.. పిటిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు పిటిషన్లు వేసి కోర్టు సమయ వృథా చేస్తున్నారన్న న్యాయమూర్తి.. ఈ మేరకు హీరాగ్రూప్‌నకు రూ.5కోట్ల జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## ఏసీబీకి చిక్కిన ఇద్దరు అవినీతి ఉద్యోగులు

**హైదరాబాద్, డిసెంబర్ 18 :** అవినీతికి పాల్పడ్డ ఇద్దరు ఉద్యోగులు ఏసీబీకి చిక్కారు. నిర్మల్, ఖమ్మం జిల్లాలో జరిగిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. నిర్మల్ జిల్లా భైంసా మండలంలో తానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జి భీమన్న గురువారం మధ్యాహ్నం బాధితుడి నుంచి రూ. 9వేలు ఫోన్ పే చేయించుకున్నందుకు ఆధారాలతో సహ ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. భైంసా ఎన్‌బీ నగర్‌లో నివాసముండే ఒకరు మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, సరెండర్ లీవ్, ఎఫ్‌టీఏ బిల్లు కోసం సీనియర్ అసిసెంట్‌ను సంప్రదించగా లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఆదిలాబాద్ రేంజ్ ఏసీబీ అధికారులను ఆశ్రయించగా వ్యూహం ప్రకారం దాడులు చేసి భీమన్నను పట్టుకున్నారు. ఖమ్మం జిల్లా కారేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గా పనిచేస్తున్న ఉషా శుభ కామేశ్వరి రూ. 10 వేలు లంచం తీసుకుంటు పట్టుబడ్డారు. ల్యాండ్ మ్యుటేషన్ కోసం అవసరమైన ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికేట్‌కు ఆర్ఐను సంప్రదించారు. దీంతో లంచం డిమాండ్ చేసిన ఆమెకు రూ.10 వేలు బాధితులు అందిస్తుండగా మాటు వేసిన ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఆర్ఐపై కేసు నమోదు చేసుకుని ఏసీబీ కేసులను విచారిస్తున్న వరంగల్ జడ్జి ఎదుట ప్రవేశపెట్టారు.




## తెలంగాణ గ్రూప్-3 ఫలితాలు విడుదల

**హైదరాబాద్, డిసెంబర్ 18 :** తెలంగాణ గ్రూప్-3 అభ్యర్థుల ఫలితాలు గురువారం విడుదల య్యాయి. సెలక్షన్ లిస్ట్‌ను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసింది. గ్రూప్-3కి 1,370 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. గతేడాది నవంబర్ 17, 18 తేదీల్లో జరిగిన గ్రూప్-3 పరీక్ష జరిగిన విషయం తెలిసిందే. జూనియర్ అసిస్టెంట్, ఎల్‌డి స్టెనో, టైపిస్ట్, జూనియర్ స్టెనోగ్రాఫర్ తదితర పోస్టులను భర్తీ చేసేందుకు నిర్వహించిన పరీక్షకు సుమారు 2.5 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు.గ్రూప్ 3 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల హాల్ టికెట్ నంబర్లు అధికారిక వెబ్‌సైట్ లో అందుబాటులో ఉంచింది. కోర్టులో ఉన్న పెండింగ్ కేసుల తుది తీర్పుకు లోబడి ఈ ఫలితాల ఎంపిక ఉంటుందని టీజీపీఎస్సీ స్పష్టం చేసింది. ఒక్క ఖాళీని ప్రస్తుతం విత్‌హెల్డ్ లో ఉంచింది కమిషన్. తప్పుడు వివరాలు సమర్పించినట్లు తేలితే ఎంపికను రద్దు చేస్తామని కమిషన్ హెచ్చరించింది. గత ఏడాది నవంబర్ 17, 18 తేదీల్లో గ్రూప్-3 పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే.

## గణతంత్ర వేడుకల అతిథిగా యూరోపియన్ నేతలు?

**న్యూఢిల్లీ, డిసెంబర్ 18 :** జనవరి 26వ న గణతంత్ర దినోత్సవ వేడుకలకు యూరోపియన్ యూనియన్ నేతలు రాబోతున్నట్టు సమాచారం. ప్రతి సంవత్సరం జనవరి 26న నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఏదో ఓ దేశాధినేతని భారత్ ఆహ్వానించడం ఆనవాయితీగా వస్తోంది. తొలిసారిగా బహుళ-దేశాల కూటమికి చెందిన నాయకులు భారత్ రిపబ్లిక్ డే వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరుకాబోతున్నట్టు తెలుస్తోంది. యూరోపియన్ యూనియన్‌తో భారత్ అతిపెద్ద వాణిజ్య ఒప్పందం ఖరారయ్యే దశలో ఉంది. అలాగే భారత్-ఈయూ మధ్య వ్యూహాత్మక భాగస్వామం ఉంది. ఈ నేపథ్యంలో 2026 జనవరి 26న జరిగే గణతంత్ర వేడుకలకు యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టాను ఆహ్వానించినట్టు వార్తలు వస్తున్నాయి. వచ్చే ఏడాది జనవరిలో న్యూఢిల్లీలో భారత్-ఈయూ సమ్మిట్ జరగనుంది. దాదాపు అదే సమయంలో ఈ నాయకులు భారత్‌కు రాబోతున్నట్టు సమాచారం. భారత్-ఈయూల మధ్య చాలా కాలంగా ఉచిత వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుగుతున్నాయి(ఎనిటతిజీ ఇజ స్గ÷జీబితినీనిబ). వచ్చే ఏడాది జనవరిలో ఈ చర్చల్లోనూ పురోగతి సాధించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికా అధిక సుంకాల నేపథ్యంలో యూరోపియన్ యూనియన్‌తో వాణిజ్య ఒప్పందం గురించి భారత్ తీవ్రంగా కసరత్తు చేస్తోంది. వచ్చే నెలలో భారత్‌తో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ పూర్తవుతుందని ఈయూ ట్రేడ్ కమిషనర్ మరోస్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## అణు ఇంధన రంగంలోకి ప్రైవేట్..

### కీలక బిల్లుకు పార్లమెంట్ ఆమోదం

**దిల్లీ:** అణు ఇంధన రంగంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని అనుమతించే బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. సస్టెయినబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా-శాంతి పేరుతో రూపొందించిన ఈ బిల్లుకు బుధవారం లోక్‌సభ ఆమోదం తెలపగా.. గురువారం రాజ్యసభలో మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. ఈ బిల్లుపై చర్చకు మంత్రి జితేంద్రసింగ్ సమాధానమిస్తూ.. ఇతర పునరుత్పాదక ఇంధన వనరులతో పోలిస్తే అణుశక్తి ద్వారా నిరంతరాయ విద్యుత్ సరఫరాకు ఆస్కారం ఉంటుందని చెప్పారు. భద్రత విషయంలో ఆందోళన అక్కర్లేదున్నారు. రేడియేషన్ వల్ల ప్రజలకు హాని జరిగినట్లుగా ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టంచేశారు. 2047 నాటికి 100 గిగావాట్ల అణు విద్యుదుత్పత్తిని సాధించాల్సి ఉందని గుర్తుచేశారు. ప్రైవేటు భాగస్వాముల్ని అనుమతించడం వల్ల పెట్టుబడులు, ఉద్యోగావకాశాలు కూడా పెరుగుతాయని అధికారపక్షం చెబుతోంది. రాజ్యసభలో ఈ బిల్లుపై చర్చ సందర్భంగా ప్రైవేటు భాగస్వామ్యాన్ని విపక్ష ఎంపీలు తప్పుబట్టారు. దేశ సార్వభౌమత్వం, భద్రతపై దీనివల్ల ప్రభావం పడుతుందని తృణమూల్ ఎంపీ సాగరిక ఘోష్ ఆరోపించారు. ఈ బిల్లు చాలా ప్రమాదకరమని డీఎంకే ఎంపీ పీ విల్సన్ విమర్శించారు. ప్రైవేటుకు లాభాలు కట్టబెట్టడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోందన్నారు. ఈ బిల్లును సెలక్ట్ కమిటీకి పంపించాలని డిమాండ్ చేశారు. పునరుత్పాదక ఇంధనం ఉండగా.. న్యూక్లియర్ పవర్‌పై అంత ఆసక్తి దేనికని ఆప్ ఎంపీ సందీప్ పాఠక్ ప్రశ్నించారు. ఇదే భాజపా గతంలో భారత్- అమెరికా అణు ఒప్పందాన్ని వ్యతిరేకించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. చైనా, ఫ్రాన్స్, రష్యా వంటి దేశాల్లో అణు ఇంధన రంగం ప్రభుత్వం చేతిలోనే ఉందని, అమెరికాలో మాత్రమే 80 శాతం మేర ప్రైవేటు భాగస్వామ్యం ఉందని పేర్కొన్నారు. అమెరికా మోడల్ మనలాంటి దేశాలకు ఏమాత్రం సరికాదన్నారు. ఈ బిల్లును జేపీసీకి పంపించాలని బీజేడీ ఎంపీ ముజిబుల్లాఖాన్ డిమాండ్ చేశారు.

# ఆ పదిమందిని బిఆర్ఎస్ ఆహ్వానించాలి!



**ప్రజాప్రతినిధులు పార్టీలు మారడం అన్నది అనైతికమని అందరూ అనుకుంటున్నా.. కాదని తేలిపోయింది. ఎవరు ఎటుపోయినా కిమ్మనకుండా ఉంటే మంచిది. దీనికోసం కోర్టులు, విచారణలు అవసరం లేదని తెలంగాణ ఎమ్మెల్యేల ఫిరాయింపులు స్పష్టం చేశాయి. నిజానికి ఫిరాయింపులకు ఏ పార్టీ కూడా మినహాయింపు కాదు. కాకపోతే దానికి రకరకాల పేర్లు పెట్టి పిలిచారు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత టిఆర్ఎస్ అధినేతగా ఉన్న కెసిఆర్ ఆనాడు నిర్లజ్జగా ఇతర పార్టీల ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకున్నారు. అలాగే ఇద్దరు ఎమ్మెల్యేలను అకారణంగా అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయించారు. జర్మనీ పౌరసత్వం ఉన్న చెన్నమనేని రమేశ్‌ను రెండు పర్యాయాలు ఎమ్మెల్యేను చేసి కథ నడిపించారు. ఇవన్నీ అనైతికమైతే... పదిమంది పార్టీ మారడం కూడా అనైతికం అవుతుంది. లేదంటే చెల్లుకు చెల్లు అని సరిపెట్టుకోవాల్సిందే.**

ఇక ఎలాటూ ఆ పదిమంది తాము బిఆర్ఎస్‌లోనే ఉంటున్నామని చెప్పడం ద్వారా వారికి తిరిగి గులాబీ కండువా కప్పి తెలంగాణ భవన్‌లో సన్మానించాలి. ఇవన్నీ మరచి ఇప్పుడు తమ పార్టీకి చెందిన వారు కాంగ్రెస్‌లో చేరితే గగ్గోలు పెట్టారు. సుప్రీం తీర్పు, తరవాత స్పీకర్ తీర్పు దరిమిలా సమాజంలో పెద్దగా మార్పు కనిపించదు. ఎందుకంటే నైతికతకు తావులేని చోట తీర్పులు ఇలాగే ఉంటాయి. కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా ఇప్పుడు ఫిరాయింపులపై తేలిందంతే. ఎమ్మెల్యేలంతా తాము బిఆర్ఎస్‌లోనే ఉన్నామంటున్నారు. స్పీకర్ కూడా అదే చెప్పారు. కనుక ఈ పదిమంది ఎమ్మెల్యేలను స్వాగతించి, ప్రచారం చేసుకోవడం ద్వారా బిఆర్ఎస్ చతురత ప్రదర్శించాలి. ఆ పదిమందిని పార్టీ కార్యక్రమాలకు ఆహ్వానించాలి. అప్పుడు వారి రంగు తెలుస్తుంది. ఇకపోతే రాజ్యాంగానికి అన్యాయం జరిగిందంటూ. ఓట్ చోరీ అంటూ గగ్గోలు పెడుతున్న కాంగ్రెస్ నేతలు ఇకనుంచి ఈ రకమైన అరుపులు మానేయాలి. రాజ్యాంగం ప్రకారం ముందు వారు నడవడం నేర్చుకోవాలి. రాహుల్ పార్లమెంట్‌లో ఒకమాట బయట మ-రోమాట మాట్లాడడం మానాలి. నీతిమాలిన రాజకీయాలను పక్కన పెట్టాలి . హర్యానాలో కాంగ్రెస్ నుంచి గెలిచి బీజేపీలో చేరిన ఎమ్మెల్యేలపై ఫిరాయింపు నిరోధక చట్టాన్ని ప్రయోగించి వెంటనే వారిపై అనర్హత వేటు వేయాలని ఆనాడు కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఫిరాయింపు చట్ట ప్రయోగానికి సాంకేతికత కంటే నైతికతే ప్రామాణికమని ఆ రాష్ట్ర శాసనసభ స్పీకర్‌కు సూచించింది. మరోవైపు కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ భారత రాజ్యాంగ రక్షకుడిని తానే అన్నంతగా రాజ్యాంగ ప్రతిని చేతిలో పట్టుకొని రాష్ట్రాలు తిరుగుతూ ఫొటోలకు పోజులిస్తుంటారు. మోడీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని కాలరాస్తోందని అంటున్నారు.

ఒక్క మోడీయే కాదు.. దేశమంతా ఇలాగే తగులబడింది. అధికారానికి అలవాటు పడ్డ పార్టీలు ఇంతకన్నా భిన్నంగా చేయలేవు. రాజ్యాంగ రక్షణ విషయంలో దేశమంతా ఒకే విధానం ఉండాలి. రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ సాంకేతిక కారణాలను చూపుతూ ఫిరాయింపు ఎమ్మెల్యేలు బిఆర్ఎస్‌లోనే ఉన్నారని తేల్చారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్లను కొట్టివేశారు. కారు గుర్తు మీద గెలిచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేల్లో ఐదుగురు గోడ దూకినట్టు నిర్ధారించేందుకు తగినన్ని భౌతిక ఆధారాలు లేవని, సాంకేతికంగా వారు బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారని స్పీకర్ పేర్కొన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు (భద్రాచలం), బండ్ల కృష్ణమోహన్ రెడ్డి (గద్వాల), గూడెం మహిపాల్ రెడ్డి (పటాన్ చెరు), ప్రకాశ్ గౌడ్ (రాజేంద్రనగర్), అరికెపూడి గాంధీ (శేరిలింగంపల్లి)పై దాఖలైన పిటిషన్లను స్పీకర్ కొట్టివేశారు. ఎమ్మెల్యేలు పార్టీ మారారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేసిన ఆరోపణలను నిరూపించడానికి అవసరమైన ఆధారాలను సమర్పించలేదని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఇప్పుడు బిఆర్ఎస్ కూడా నైతికత ప్రదర్శించాలి. ఈ ఎమ్మెల్యేలను తిరిగి పార్టీలోకి ఆహ్వానించి గులాబీ కండువా కప్పాలి.

అప్పుడు వారు వస్తారా లేదా అన్నది వారి ఇష్టం లేదంటే బిఆర్ఎస్‌లోనే మరో గ్రూపుగా అయినా ఉండిపోతారు. నిజానికి గతంలో వేములవాడ ఎమ్మెల్యే విషయంలో బిఆర్ఎస్ కూడా అనైతికతకు పాల్పడింది. ఆయనకు జర్మనీ పౌరసత్వం ఉందని తెలిసినా కులగజ్జితో ఎమ్మెల్యేను చేశారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా సకల సౌఖ్యాలు అనుభవించారు. దీనిపై ఆనాడు ఫిర్యాదు వచ్చిన వెంటనే కెసిఆర్ స్పందించలేదు. ఈ వ్యవహారం కోర్టుల్లో తేలడానికి పదేళ్లు పట్టింది. అందుకే పదిమంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించారంటూ బీఆర్ఎస్ ఇచ్చిన ఫిర్యాదులపై వాదించే అధికారం బిఆర్ఎస్ నైతికంగా కోల్పోయింది. రాజకీయాల్లో కఠిన చట్టాలను తుంగలో తొక్కుతున్నదే ప్రజాప్రతినిధులు అన్నది మరచిపోరాదు. ఫిరాయింపులపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు మరి కొందరు ఎమ్మెల్యేలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఫిరాయింపుదారులను విచారించి వారిపై చర్యలు తీసుకోవడంలో జాప్యాన్ని ఆక్షేపించారు. స్పీకర్ సాగదీత ధోరణిపై సుప్రీంకోర్టు ధర్మాసనం పలుమార్లు ఆగ్రహం వ్యక్తంచేసింది. ఫిరాయింపుపై మూడు నెలల్లో తేల్చాలని తొలుత జులై 31న ఆదేశించింది. అక్టోబర్ 21తో గడువు ముగిసినా తేల్చక పోవడంపై కోర్టు సీరియస్ అయ్యింది. నవంబర్ 17న మరోసారి సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.

తెలంగాణ శాసనసభ స్పీకర్ కోర్టు ధికరణకు పాల్పడ్డారని సీరియస్ అయ్యింది. నాలుగు వారాల్లోగా విచారణ పూర్తిచేయాలని, లేదా నూతన సంవత్సర వేడుకలు ఎక్కడ జరుపుకోవాలను కుంటున్నారో నిర్ణయించుకోండి' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. నిజానికి సుప్రీం కనుక తన తీర్పును స్పీకర్ కోర్టులోకి నెట్టకుండా నేరుగా నిర్ణయం తీసుకుని తీర్పు ఇచ్చివుంటే పరిస్థితి మరోలా ఉండేది. పక్కా అఫిడవిట్లు, ఫొటోలు, బహిరంగ ప్రకటనలు, సోషల్ మీడియా పోస్టులు, అనేక నెలలుగా కాంగ్రెస్ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేల భాగస్వామ్యాన్ని స్పష్టంగా నివేదించినా అవేవీ పరిగణనలోకి తీసుకోకుండా స్పీకర్ సాంకేతికంగా ఇప్పటికీ బీఆర్ఎస్‌తోనే ఉన్నారని పేర్కొనడంపై పెద్దగా ఆశ్చర్య పడాల్సిన పనిలేదు. పార్టీ ఫిరాయింపుల విషయంలో వెలువడిన నిర్ణయం రాజకీయ పార్టీలకు కనువిప్పు కావాలి. తమకు మాత్రం వ్యతిరేకమైన సందర్భాల్లో మాత్రమే స్పందించడం కాదు...ఎప్పుడూ ఒకేలా ఉండాలి. దీనికి భిన్నంగా ఏదో జరుగుతుందని కూడా ఎవరూ అనుకోవద్దు. ప్రజాజీవితంలో నైతిక విలువలు పూర్తిగా లుప్తమైన స్థితిలో ఇలాంటి అనైతికత ఓడుతుందని నైతికత గెలుస్తుందనీ ఎదురుచూడటం అత్యాశే అవుతుంది.

# పంచాయతీ ఎన్నికల్లో చిత్రవిచిత్రాలు

- పసుపు బియ్యంపై ప్రమాణాలు
- ఒకటి రెండు ఓట్లతో ఓటమి.. గెలుపు
- టాస్ విజేతల్లో ఆనందోత్సాహాలు



**హైదరాబాద్, డిసెంబర్ 18 :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అనేక చిత్ర విచిత్రాలు జరిగాయి. ఒకే కుటుంబంలో కొందరు పరస్పరం పోటీ పడ్డారు. డబ్బులు ఇచ్చిన ఓటేయలేదని కొందరు ఆక్రోశించారు. పసుపు బియ్యం పట్టుకుని ప్రమాణం చేయించారు. దేవుడి ఫోటోమీద ప్రమాణాలు జరిగాయి. ఏతావాత ఓటింగ్ మాత్రం అద్భుతంగా సాగింది. ఒకటి, రెండు, మూడు ఇలా స్వల్ప ఓట్ల తేడాతో పలువురు అభ్యర్థులు గెలుపొందగా, మరికొందరు ఓటమి పాలయ్యారు. కొందరికి సమాన ఓట్లు రాగా టాస్ వేసి విజేతలను ప్రకటించారు. నిర్మల్ జిల్లా ముథోల్ మండలం రువ్వి గ్రామంలో ఒక్క ఓటుతో నక్క మల్లేశ్‌ను సర్పంచ్ పదవి వరించింది. మొదట ఒక్క ఓటు అధిక్యం రాగా, రీ కౌం టింగ్‌లోనూ మల్లేశ్‌ను గెలుపు వరించింది. భైంసా మండలం లింగా గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా సుష్మారాణి ఒక్క ఓటుతో గెలుపొందారు. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం గుర్రాలగండిరాజపల్లి లో కాంగ్రెస్ అభ్యర్థి బూస నర్సయ్య ఒక్క ఓటుతో గెలిచారు. నెక్కొండ మండలం అమీన్‌పేటలో బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థి డెక్క చంద్రయ్య తొలుత ఒక్క ఓటుతో గెలువగా, ప్రత్యర్థులు రీ కౌంటింగ్‌కు డిమాండ్ చేశారు. చివరకు కలెక్టర్ జోక్యంతో ఇక్కడ ఫలితాన్ని ప్రకటించినట్టు సమాచారం. కాంగ్రెస్ బలపరిచిన డెక్క ఎల్లయ్యకు 256 ఓట్లు రాగా, బీఆర్ఎస్ బలపరిచిన డెక్క చంద్రయ్యకు 255 ఓట్లు వచ్చాయి. ఒక్క ఓటు తేడాతో ఎల్లయ్య గెలిచినట్టు అధికారులు ప్రకటించారు. నెక్కొండ మండలం సీతారాంపురంలో బీఆర్ఎస్ మద్దతునిచ్చిన అభ్యర్థి కట్కూరి విజయలక్ష్మి ఒక్క ఓటు తేడాతో విజయం సాధించారు. నెక్కొండ మండలం రెడ్యానాయక్‌తండాలో బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థి అంగోత్ ఉమ రెండు ఓట్ల తేడాతో గెలిచింది. నెక్కొండ మండలం మడిపెల్లిలో కాంగ్రెస్ అభ్యర్థి అంగోత్ అనూష మూడు ఓట్ల తేడాతో గెలిచింది. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండ లం భూక్యాతండా సర్పంచ్ స్థానానికి తొలు త ఎనిమిది మంది నామినేషన్ వేశారు. కాంగ్రెస్ బలపరిచిన మదన్‌కు మద్దతు ఇవ్వాలని తండావాసుల నిర్ణయంతో ఆరుగురు విత్ డ్రా చేసుకున్నారు. చివరి రోజు బీఆర్ఎస్ బలపరిచిన రమావత్ శ్రీకాంత్ సైతం విత్ డ్రా చేసుకోవడానికి వెళ్లగా, మూడు నిమిషాలు ఆలస్యం కావడంతో అధికారులు లోపలికి అనుమతించలేదు. మూడో విడతతో మూడు ఓట్ల అధిక్యంతో శ్రీకాంత్ గెలిచాడు. అదృష్టం వరించిన అభ్యర్థులు నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని బెల్గాం తండా సర్పంచ్‌గా జాదవ్ గోకుల్‌దాస్ టాస్ ద్వారా ఎన్నికయ్యాడు. బెల్గాం తండా జీపీలో అనిల్, జాదవ్ గోకుల్‌కు 192 చొప్పున సమాన ఓట్లు వచ్చాయి. దీంతో టాస్ వేయగా అదృష్టం గోకుల్‌ను వరించింది. నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలంలోని కంఠం గ్రామంలో టాస్ ద్వారా సర్పంచ్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అజ్గిరి సాయినాథ్ గెలుపొందారు. ఇబ్రహీంపేట్ జీపీ, బోర్లం క్యాంపు తండాలో ఇద్దరు వార్డు సభ్యులను టాస్ ద్వారా నిర్ణయించారు.

# మహాత్ముడిని అవమానించారు

## రాష్ట్రాలపై భారం మోపేలా బిల్లు : ఎంపి ప్రియాంకగాంధీ



**న్యూఢిల్లీ, డిసెంబర్ 18 :** మహాత్మాగాంధీని అవమానించేందుకే కొత్తగా జి రామ్ జీ బిల్లును తీసుకుని వచ్చారని కాంగ్రెస్ ఎంపి ప్రియాంకగాంధీ ఆరోపించారు. సభ వాయిదా పడిన తరువాత పార్లమెంట్ వెలుపల ప్రియాంక గాంధీ వాద్రా మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీ రామ్‌జీ బిల్లును ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయన్నారు. 'బిల్లులోని వివరాలను చదివిన ఎవరికైనా గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎలా పూర్తి కాబోతోందో అర్థమవుతుంది. ఈ బిల్లు వలన రాష్ట్రాలపై మరింత ఆర్థిక భారం పడనుంది. రాష్ట్రాలు ఆర్థికంగా ఇబ్బంది పడే అవకాశం ఉంది. నరేగా పథకం పేదలకు అండగా ఉండేది. కానీ, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లు పేదలకు పూర్తి వ్యతిరేకంగా ఉంది.' అంటూ కేంద్ర ప్రభుత్వం తీరుపై ప్రియాంక తీవ్ర విమర్శలు చేశారు.

# సభలో విపక్షం తీరు దారుణం

- ప్రతులను చించివేయడం సభను అవమానించడమే
- కేంద్రమంత్రులు బఘేల్, చిరాగ్ పాశ్వాన్

**న్యూఢిల్లీ, డిసెంబర్ 18 :** కేంద్ర మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్ మాట్లాడుతూ.. లోక్‌సభలో విపక్ష సభ్యులు వ్యవహరించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో బిల్లు కాగితాలను చించివేశారని.. ఇది ఖండించాల్సిన అంశమన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలకు చోటు లేదన్నారు. జీ రామ్‌జీ బిల్లుపై సుదీర్ఘంగా చర్చించారని.. అయినప్పటికీ విపక్ష సభ్యులు బిల్లు ప్రతులను చించడం దారుణమన్నారు. ప్రజల ప్రయోజనాల కోసమే ఈ బిల్లును తీసుకురావడం జరిగిందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ మాట్లాడుతూ.. లోక్‌సభలో ప్రతిపక్ష సభ్యులు వ్యవహరించిన తీరు ఏమాత్రం ఆమోదనీయం కాదన్నారు. 'మీకు వ్యతిరేకించే హక్కు ఉంది. కానీ, ఈ రకమైన ప్రవర్తన సరికాదు. బిల్లు ప్రతులను చించివేయడం, విమానాలు తయారు చేయడం, స్పీకర్‌పై విసరడం సరికాదు. దేశంలోనే అతి పురాతన పార్టీగా చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ సభ్యులు.. ఇలా ప్రవర్తించడం గర్హనీయం. బిల్లుకు పెట్టిన పేరును విపక్ష సభ్యులు వ్యతిరేకిస్తున్నారు. కానీ, రాముడి పేరు ఆ మహాత్మా గాంధీకి ఎంతో ఇష్టమైన పేరు. ఆయన తుదిశ్వాస విడిచే సమయంలోనూ 'హే రామ్' అనే అన్నారు.' అంటూ కేంద్ర మంత్రి పేర్కొన్నారు.



# కాంగ్రెస్ అగ్రనేతలకు వేధింపులు

## నిరసనలకు కాంగ్రెస్ దిగడంతో ఉద్రిక్తత

**హైదరాబాద్, డిసెంబర్ 18 :** నగరంలోని గాంధీభవన్ వద్ద భారీగా పోలీసులను మోహరించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌ను ఈడీ కేసులతో వేధిస్తున్నారని పార్టీ శ్రేణులు ఆరోపించాయి. ఈ నేపథ్యంలో ఏఐసీసీ పిలుపు మేరకు టీపీసీసీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన ర్యాలీకి సిద్ధమయ్యారు. భాజపా కార్యాలయం వరకు వెళ్లేందుకు పెద్దఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు తరలిరావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ నిరసనకు అనుమతి లేదని చెప్పారు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో పాటు ముఖ్యనేతలు గాంధీభవన్‌కు చేరుకున్నారు. నిరసనకు పోలీసుల నిరాకరించడంతో నేతలు అక్కడే బైఠాయించారు. భాజపాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# టాంజానియాలో నల్లగొండ వాసి మృతి

**నల్గొండ, డిసెంబర్ 18 :** నల్గొండ జిల్లా మునుగోడు మండలం పలివెల గ్రామానికి చెందిన బడుగు రాజు (38) టాంజానియా దేశంలో గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయాన్ని అతడి సహచరులు రాజు కుటుంబ సభ్యులకు తెలియజేశారు. మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకొచ్చేందుకు స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి.. మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ఆ దేశ రాయబారులతో మాట్లాడుతున్నారు. బడుగు రాజు టాంజానియా రాజధాని దారుస్సలాంలో జియాలాజిస్ట్‌గా పనిచేస్తున్నట్టు సమాచారం. ఆయన మరణవార్తతో గ్రామంలో విషాదం అలముకుంది. కటుఉంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.

# వార్డు మెంబర్‌గా గెలిచిన ట్రాన్స్‌జెండర్

**నాగర్‌కర్నూల్, డిసెంబర్ 18 :** ట్రాన్స్ జెండర్ అంటే.. గృహప్రవేశాలు, శుభకార్యాలలో, రోడ్లపై వాహనాలు ఆపి డబ్బులు వసూలు చేస్తారని అంతా భావిస్తారు. కానీ, తాము ప్రజా సేవలోనూ ముందుంటామని ఈ ట్రాన్స్‌జెండర్ నిరూపిస్తున్నారు. పంచాయితీ ఎన్నికల్లో నిలవడమే కాకుండా.. జయకేతనం ఎగురవేశారు. నాగర్ కర్నూల్ జిల్లా చారగొండ మండలంలో మూడవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా చారకొండ గ్రామపంచాయతీకి ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో 11వ వార్డు అభ్యర్థిగా పోటీ చేసిన ట్రాన్స్ జెండర్ నందిని ఎన్నికయ్యారు. ఈ పంచాయతీలో 12 వార్డులకు గాను 11వ వార్డుకు ఎస్సీ జర్నరల్ కేటాయించారు. ఈ వార్డు నుంచి కాంగ్రెస్ మద్దతుతో నందిని, బీఆర్ఎస్ నుంచి పెద్దాపూర్ వెంకటయ్య, బీఎస్పీ నుంచి మల్లేష్ పోటీ పడ్డారు. ఈ వార్డులో మె-త్తం 372 ఓటర్లు ఉన్నారు. బుధవారం వెల్లడైన ఫలితాలలో నందిని.. బీఆర్ఎస్ అభ్యర్థిపై 64 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఆమె గెలుపుపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన నందిని.. ట్రాన్స్‌జెండర్ మహిళలు ఓన్లీ నూతన గృహప్రవేశాలప్పుడు, శుభకార్యాలలో డబ్బులు వసూలు చేస్తారనే భావన ప్రజల్లో ఉంటుంది. కానీ, డబ్బులు వసూళ్లకే పరిమితం కాకుండా అన్నిట్లో మేమున్నామని చాటిచెప్పాలనే తన లక్ష్యమన్నారు. తనను ఆదర్శంగా తీసుకొని ట్రాన్స్‌జెండర్ మహిళలు అన్నింట్లోనూ ముందుండాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ నా సేవలు గుర్తించి అవకాశం కల్పించిందని.. తనను గెలిపించిన గ్రామ ప్రజలకు నందిని కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచిన గ్రామ ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉంటూ.. గ్రామ అభివృద్ధి కోసం తోడ్పడతానన్నారు.

# రీకౌంటింగ్‌లోనూ ఒక్క ఓటుతో విజయం

## రంగాపూర్‌లో విజయం సాధించిన గంట రమేశ్



**పెద్దపల్లి, డిసెంబర్ 18 :** ప్రజాస్వామ్యంలో ఓటు చాలా విలువైనది. ఒక్క ఓటు ఎందరినో గెలిపిస్తుంది అంటుంటారు. సామాన్యుడికి ఓటు వజ్రాయుధం అన్నట్లు.. ఓటుతోనే ఏదైనా సాధించవచ్చని అన్నట్లు.. తలరాతలనే తారుమారు చేసేలా మారింది ఓటు. పెద్దపల్లి మండలం రంగా పూర్ సర్పంచ్ ఎన్నికల సం దర్భంగా అదే ఆవిష్కృతమైంది. మూడో విడుత ఎన్నికల సందర్భంగా రంగాపూర్ గ్రామానికి సర్పంచ్ అభ్యర్థులుగా గంట రమేష్, కలబోయిన నరేందర్, ఈర్ల భువన్ తేజ్ పోటీ చేశారు. అయితే ఈ నెల 5న నామినేషన్లతో ప్రారం భమైన ఎన్నికల తంతు బుధవారం జరిగిన ఎన్నికలతో ముగిసింది. ఇక్కడ ఒకే పార్టీలో ఒకే నాయకునికింద ప్రధాన అనుచరులుగా చలామణి అయినవారు ఇప్పుడు ప్రత్యర్థులుగా మారి ఎన్నికల్లో తలపడ్డారు. అయితే హోరా హోరీగా జరిగిన ఎన్నికల ప్రచారంతో టగ్ ఆఫ్ వార్ లా కొనసాగింది. ఈ క్రమంలో ఎన్నికలు జరుగగా కాంగ్రెస్ పార్టీలోనే పెద్దపల్లి ఎమ్మెల్యే సీహెచ్ విజయరమణారావుకు ప్రదాన అనుచరులుగా ఉన్న ఇద్దరు నాయకులు ఆ గ్రామానికి మాజీ ప్రజాప్రతినిధులే కావడం విశేషం. అందులో ఒకరు గంట రమేష్ కాగా మరొకరు కలబోయిన మహేందర్ తమ్ముడు నరేందర్. వీరిద్దరు కూడా అదే గ్రామానికి ఒకే పార్టీ నుంచి ఇద్దరు సర్పంచ్ అభ్యర్థులుగా రంగంలో దిగారు, గత వారం రోజులుగా హోరాహోరీ జరిగిన ప్రచారంలో పోలింగ్ జరిగింది. గంట రమేష్ బ్యాట్ గుర్తుకు 886 ఓట్లు, ప్రత్యర్థి కలబోయిన నరేందర్‌కు 884ఓట్లు వచ్చాయి. అలాగే మరో అభ్యర్థి ఈర్ల భువనతేజ కు 5 ఓట్లు పోలవగా, ఒక ఓటు నోటాకు పడింది. పోలైన ఓట్లలో 15ఓట్లు చెల్లకుండా పోయాయి. కెవలం రెండు ఓట్లతో గంట రమేష్ గెలువడం ఇరువర్గాలను ఆందోళనకు గురి చేసింది. పోలైన 15 ఓట్లు చెల్లనివిగాపోవడంతో అవి మాకు సంబంధించి నవే అయి ఉండవచ్చని బావించిన ప్రత్యర్థి వర్గంతో పాటు అభ్యర్థి కూడా రీకౌంటింగ్ చేయాలనిపట్టు బట్టడడంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి పోలైన ఓట్లకు రీ కౌంటింగ్ జరిపారు. రీ కౌంటింగ్ అనం తరం గంట రమేష్‌కు ఒక ఓటు తగ్గి 885, కలబోయిన నరేందర్‌కు 884 ఓట్లు వచ్చాయి. రీకౌంటింగ్ తర్వాత ఒక ఓటు తగ్గిపోయి ఒకే ఒక్క ఓటుతో గంట రమేష్ తన సమీప ప్రత్యర్థి కలబోయిన నరేందర్‌పై విజయం సాధించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. ఒక్క ఓటు ఇద్దరు అభ్యర్థులకు, వారి అనుచరగణానికీ గంటపాటు చెమటలు కక్కించింది.

# వల్లభనేని వంశీపై మరో కేసు నమోదు

**విజయవాడ, డిసెంబరు 18 :** వైసీపీ కీలక నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి ఊహించని షాక్ తగిలింది. మాచవరం పోలీస్ స్టేషన్‌లో వల్లభనేని వంశీపై గురువారం కేసు నమోదైంది. సునీల్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో వంశీపై కేసు నమోదు చేశారు. 2024లో జులైలో తనపై వంశీ ఆయన అనుచరులు దాడికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వంశీతో సహా మరో ఎనిమిది మందిపై మాచవరం పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, సత్యవర్ధన్‌ను వంశీ అండ్ కో కిడ్నాప్ చేసి దాడి చేశారని పోలీసులు గుర్తించారు. ఈ కేసులో వల్లభనేని వంశీ జైల్లో ఉండి బెయిల్‌పై బయటకు వచ్చిన విషయం తెలిసిందే. 2023లో గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి జరిగింది. అయితే ఈ దాడిలో ప్రధాన సాక్షిగా సత్యవర్ధన్ ఉన్నారు. ఈ ఘటనలో ఆయన ఇచ్చిన ఫిర్యాదే కీలకంగా మారింది. ఈ క్రమంలో సత్యవర్ధన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకే వల్లభనేని వంశీతో పాటు ఆయన అనుచరులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు. 2024 జులైలో తనపై వంశీ అండ్ కో దాడికి పాల్పడ్డారని ఫిర్యాదులో సత్యవర్ధన్ తెలిపారు. దీంతో వంశీతో పాటు మరో ఎనిమిది మందిపై మాచవరం పోలీసులు కేసు నమోదు చేశారు.

## రాగిబావి సర్పంచిగా విజయం సాధించిన మెండు శ్రీవాణి-చంద్రశేఖర్ రెడ్డి



**మోత్కూర్ రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మండల పరిధిలోని రాగిబావి సర్పంచిగా మెండు శ్రీవాణి చంద్రశేఖర్ రెడ్డి సిపిఎం,బిజెపి,బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ గా గెలుపొందిన మెండు శ్రీవాణి మాట్లాడుతూ రాగి బావి గ్రామ ప్రజలు నన్ను గుర్తించి గ్రామానికి సేవ చేసే అదృష్టం కల్పించినందుకు రాగి బావి గ్రామ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు, గ్రామంలో ఉన్న ప్రతి సమస్య నా సమస్య గా భావిస్తూ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు పసునూరి సత్తిరెడ్డి, మాజీ ఎంపిటిసి పానుగళ్ళ విష్ణు, మాజీ సర్పంచ్ రాపాక నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

## పనకబండ అభి వృద్దే లక్ష్యంగా పనిచేస్తా

### సర్పంచ్ లోతుకుంట రేణుక అనిల్ కుమార్



**మోత్కూరు.. రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మండల పరిధిలోని పనకబండ గ్రామ పంచాయతీ సర్పంచిగా లోతుకుంట రేణుక అనిల్ కుమార్ బిజెపి పార్టీ బలపరిచిన బిఆర్ఎస్ అభ్యర్థి గా విజయం సాధించారు. అనంతరం సర్పంచ్ గా గెలుపొందిన లోతుకుంట రేణుక మాట్లాడుతూ నాపై నమ్మకంతో నా విజయానికి సహకరించిన నాయకులకు కార్యకర్తలకు గ్రామ ప్రజలకు ఓటర్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నాపై నమ్మకంతో గెలిపించినందుకు గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి గ్రామ ప్రజలు నాయకులు సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానాని గ్రామ ప్రజలకు తెలిపారు ఈ కార్యక్రమంలో లోతుకుంట స్వామి,మాజీ సర్పంచ్ బత్తిని తిరుమలేష్,బత్తిని మహేష్, నల్లబోవుల వెంకన్న,బత్తిని సుదర్శన్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.








## తరుణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులు అందజేత

**ఆత్మకూర్(ఎం). రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు( ఎం). మండలం పల్లెర్ల గ్రామానికి చెందిన గుర్రం తరుణ్ 7వ వర్ధంతి సందర్భంగా పాఠశాలలో చదువుతున్న అన్ని తరగతుల విద్యార్థుల మొదటి ర్యాంక్ ఉన్న విద్యార్థులకు ప్రథమ ద్వితీయ బహుమతులను తరుణ్ ఫౌండేషన్ చైర్మన్ గుర్రం లావణ్య నర్సింహా చేతుల మీదుగా ఇవ్వడం జరిగింది వారు మాట్లాడుతూ తరుణ్ ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశం విద్యార్థులు మంచిగా చదివి పాఠశాలకు మంచి పేరు తేవాలని వాహనాలు డ్రైవింగ్ చేసేసమయం హెల్మెట్ ధరించాలని సూచించారు నిరుపేద విద్యార్థులకు చదువుకోడానికి ఆర్థిక సహాయం కూడా అందజేస్తామని అన్నారు అనంతరం నూతన సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులను తరుణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు విద్యార్థులకు తరుణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ సర్పంచ్ మంజుల నర్సింహా మాజీ జడ్పీటీసీ నరేందర్ గుప్తాసందీప్ వెంకటేష్ శ్రీనివాస్ మహేష్ రమేష్ రాజు వినోద్ లక్ష్మమమ్మ నిర్మల పాఠశాల ఉపాధ్యాయులు నూతన వార్డు సభ్యులు గ్రామ నాయకులు యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మీనాక్షి నటరాజన్ ను కలిసిన జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ మోహన్ రెడ్డి



**రామారెడ్డి డిసెంబర్ 18 రాజముద్ర న్యూస్ :** రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ గారిని , జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కామారెడ్డి తో పాటు ఎల్లారెడ్డి నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల పై చర్చించినట్లు ఆయన తెలిపారు. వచ్చే ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికల్లో మరింత ఉత్సాహంగా కాంగ్రెస్ శ్రేణులు పనిచేసే, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి, ఎంపీపీ, జెడ్పి చైర్మన్ లను పూర్తిగా కైవసం చేసుకునేలా పనిచేయాలని సూచించినట్లు తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి భవిష్యత్తులో గుర్తింపు ఉంటుందని భరోసా కల్పించినట్లు తెలిపారు.

## పాలడుగు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విజయభేరి మోగించిన స్వతంత్ర అభ్యర్థి


### సర్పంచ్ అంతటి భగవంతు



**మోత్కూర్. రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మండల పరిధిలోని పాలడుగు సర్పంచ్ గా అంతటి భగవంతు స్వతంత్ర అభ్యర్థిగా అఖండ విజయం సాధించారు. అనంతరం సర్పంచ్ గా గెలుపొందిన అంతటి భగవంతు మాట్లాడుతూ గ్రామ ప్రజలు నాపై నమ్మకంతో గెలిపించినందుకు గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానాని, గ్రామ ప్రజలు నాపై నమ్మకంతో గెలిపించినందుకు గ్రామాన్ని అభివృద్ధి చేయడమే నా లక్ష్యమని అన్నారు గ్రామ ప్రజలు నా వెన్నంటూ ఉండి నడిపించిన నాయకులకు కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## ఈనెల 21వరకు జరగనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

### రాజీమార్గమే రాజ మార్గం జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా



**వికారాబాద్ రాజముద్ర న్యూస్ :** ఈనెల 21వ తేదీ వరకు జరగనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ క్షణికావేశంలో జరిగిన చిన్న తప్పులు, అనవసర వివాదాలను పరిష్కరించుకోవడానికి లోక్-అదాలత్ ఒక ఉత్తమ అవకాశం అని పేర్కొన్నారు. రాజీ కుదుర్చుకునే అవకాశం ఉన్న అన్ని రకాల కేసుల్లో కక్షిదారులు పరస్పర అంగీకారంతో రాజీ పడవచ్చని తెలిపారు. న్యాయ ప్రక్రియల వల్ల కలిగే ఆర్థిక, మానసిక ఒత్తిడులను తగ్గించుకోవడానికి లోక్-అదాలత్ ఎంతో ఉపయోగకరమని, రాజీ ద్వారా ఇరు వర్గాలు గెలిచినట్లే అవుతుందని అన్నారు. అనవసర గొడవలకు దూరంగా ఉండి, శాంతియుతంగా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ నెల డిసెంబర్ 21వరకు జరగనున్న జాతీయ మెగా లోక్-అదాలత్‌ను జిల్లా ప్రజలు కక్షిదారులు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ కోరారు.

## ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా

### కిష్టాపూర్ సర్పంచ్ బాన్సువాడ మనేవ్వ గంగోండ



**బీర్కూర్, రాజముద్ర న్యూస్ :** బీర్కూర్ మండలంలోనే కిష్టాపూర్ గ్రామాన్ని ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దుతానని సర్పంచ్ బాన్సువాడ మనేవ్వ గంగోండ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేను ఇచ్చిన హామీలు బారెడి పోచమ్మ గుడి పునః నిర్మాణం, గ్రంథాలయం, క్రీడస్థలం, మంచినీటి సరఫరా, మురికి కాలువలు, వీధి దీపాలు, సిసి రోడ్లు, సీసీ కెమెరాలు ,ప్రతి వార్డుకు సింగిల్ ఫేస్ మోటర్ ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తానన్నారు. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఆగ్రో చైర్మన్ కాసుల బాలరాజు సహకారంతో ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రతి గడపకు చేరవేస్తానన్నారు. 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానన్నారు. యువకులు, గ్రామ పెద్దలు సలహాలు, సూచనలు ఇచ్చి గ్రామ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఓటు వేసి గెలిపించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## అధికారులకు అభినందనలు తెలిపిన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



**కామారెడ్డి కలెక్టరేట్, రాజముద్ర న్యూస్ :** ప్రశాంతంగా ముగిసిన గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగస్వామ్యం అయిన అన్ని శాఖల అధికారులకు అభినందనలు తెలిపిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.మూడు దశల్లో నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికలు జిల్లా లో ప్రశాంతంగా ముగిశాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తెలిపారు ఎన్నికల నిర్వహణ లో బాధ్యత గా పని చేసిన వివిధ శాఖల అధికారులను కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా గురువారం ఎంపిడిఓ లు, వివిధ ఎన్నికల సిబ్బంది కలెక్టర్ ను శాలువాతో సన్మానించారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యకరమైన జీవితం సాధ్యం

### మున్సిపల్ కమిషనర్ సిహెచ్ హన్మంతరెడ్డి



పరిశుభ్రత ద్వారా ఆరోగ్యం, క్రమశిక్షణ, బాధ్యతా భావం పెరుగుతాయని అధికారులు పేర్కొన్నారు.

**సూర్యాపేట,రాజముద్ర న్యూస్ :** ప్రజలు తమ ఇంటి పరిసరాలు, పని చేసే ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యకరమైన జీవితం పొందగలుగుతారని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ హనుమంత్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన శ్రమదాన కార్యక్రమంలో ఆయన విద్యార్థినిలతో కలిసి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పరిశుభ్రత కేవలం మున్సిపాలిటీ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు, ప్రతి విద్యార్థి తన వంతు బాధ్యతగా భావించి స్వచ్ఛతను పాటించాలన్నారు. ఘన వ్యర్థాల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ, తడి చెత్త, పొడి చెత్తను వేరుచేయడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పరిసరాల్లో చెత్త నిల్వ లేకుండా చూసుకోవడం వంటి అంశాలు వివరించారు. పరిశుభ్రమైన వాతావరణం ఉంటేనే దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు, కాలానుగుణ జ్వరాలు నివారించవచ్చని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక బాధ్యతను కూడా అలవర్చుకోవాలని, కళాశాలలు స్వచ్ఛతకు ఆదర్శంగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు, మున్సిపల్ సిబ్బందితో కలిసి కళాశాల ప్రాంగణంలో శ్రమదానం చేసి చెత్తను తొలగించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శైలజ, సానిటరీ ఇన్స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, యేనేపల్లి యాదగిరి, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని స్వచ్ఛత కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మోడ్రన్ కబడ్డీ అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా సీనియర్ కబడ్డి సెలక్షన్స్ ఎంపిక



**ఆత్మకూర్( ఎం).రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో యాదాద్రి భువనగిరి జిల్లా స్థాయి సీనియర్ కబడ్డీ సెలక్షన్స్ ఈ రోజు జరిగాయి జిల్లా మోడ్రన్ కబడ్డి అసోసియేషన్ అధ్యక్షులు ప్రతికంఠం పూర్ణచందర్ రాజు అధ్యక్షతన ఆత్మకూరు నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ బీసు ధనలక్ష్మి క్రీడలను ప్రారంభించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆత్మకూరు మండలం కేంద్రంలో ఈ ఐదు సంవత్సరాలు క్రీడల అభివృద్ధి కి కృషిచేస్తామని తెలియచేసారు ఈ రోజు ఎంపికైన క్రీడాకారులకు యూనిఫాం అందిస్తానని తెలిపారు కబడ్డి జాతీయ అధ్యక్షుడు రాంరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై క్రీడా నిభందనలు తెలియపరచారు తేది 26 డిసెంబరు న జరుగు రాష్ట్ర స్థాయి క్రీడోత్సవాలలో ఈ జట్టు పాల్గనాలని కోరారు పిడి సత్యనారాయణరాజు యువజన నాయకులతో కలిసి క్రీడా మైదానము పరిశీలన చేసారు మైదానం అభివృద్ధికి నిధులు మంజూరి కి కృషిచేస్తానని తెల్పారు. ఆత్మకూరు ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు కొత్త మాధవ రెడ్డి ఫిజికల్ డైరెక్టర్ పి.ఇందిర ఎంపికైన జట్టు కు శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రములో ఫిఈటీ ఉప్పలయ్య నేతాజీకి యువజన మండలి అధ్యక్షుడు దొంతరబోయిన మురళీ కృష్ణ శివాజీ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉప సర్పంచ్ మజ్జిగ నరేశ్ దొంతర బోయిన భాస్కర్ బూడిద శేఖర్ గడ్డం సతీష్ యాస మహేందర్ రెడ్డి ఎల్మినేటి మురళీ రాజు పాల్గొన్నారు.



## అదనపు విద్యుత్ పోల్స్ బిగింపు

**రామారెడ్డి డిసెంబర్ 18 రాజముద్ర :** రామారెడ్డి మండల కేంద్రంలోని 2వ వార్డులో డ్యామేజ్ కరెంట్ పోల్ తొలగించి నూతన కరెంట్ పోల్ బిగించడం జరిగింది. గల్లీలోని కాలనీవాసులకు విద్యుత్ పోల్ సరిగా లేకపోవడం వలన విద్యుత్తు అంతరాయంతో ఇబ్బందులకు గురయ్యారని ఈ విషయంపై ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ స్పందించినందుకు రామారెడ్డి కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు పిప్పరి గణేష్, సత్యం,వెంకటేష్, మహేష్,ఉన్నారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్స్పెక్టర్, లైన్మెన్ ఈ యొక్క పనులను దగ్గరుండి పరిశీలించి పనులను చేయించడం జరిగింది.



## యూరియా బుకింగ్ యాప్ పై వీడియో కాన్ఫరెన్స్

### వ్యవసాయ డైరెక్టర్ గోపి వివరాలు

**రామారెడ్డి డిసెంబర్ 18 రాజముద్ర న్యూస్ :** రామారెడ్డి మండలం రైతు వేదికలో గురువారం రోజు యూరియా బుకింగ్ మొబైల్ యాప్ ద్వారా యూరియా కొనుగోలు చేసే విధానాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఐఏఎస్ గోపి వ్యవసాయ శాఖ అధికారులకు మరియు డీలర్లకు వివరించడం జరిగింది, ఇందులో భాగంగా వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి మాట్లాడుతూ ఈనెల 20 వ తేదీన వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు యాప్ ని ప్రారంభిస్తారని తెలిపారు. ఈ యాప్ లో సమీప డీలర్ల వద్ద జిల్లా స్థాయిలో ఎన్ని యూరియా బస్తాలు ఉన్నాయో రైతులు చూసుకునే సౌలభ్యం కలదు అన్నారు. ఈ యాప్ లో రైతులు తమ పంట వివరాలు సాగు విస్తీర్ణం నమోదు చేసిన వెంటనే యూరియా పరిమాణం స్వయంచాలకంగా లెక్కింపబడుతుంది. బుకింగ్ పూర్తయిన వెంటనే బుకింగ్ ఐడి లభిస్తుంది. ఆ ఐడి చూపించి యూరియాను పొందవచ్చని తెలియజేశారు. ముందస్తు బుకింగ్స్ సౌకర్యంతో పాటు అనుకూలమైన డీలర్ ను ఎంపిక చేసుకోవచ్చని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏవో భాను శ్రీ, ఏఈవోలు నిఖిత, భబిత, మరియు డీలర్లు పాల్గొన్నారు.




## ఐఎఫ్‌టియు జాతీయ జనరల్ కౌన్సిల్‌కు బయలుదేరిన జాతీయ రాష్ట్ర నాయకులు

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** బీహార్ రాష్ట్రంలో నీ కెహల్గామ్ పట్టణంలో భారత కార్మిక సంఘాల సమాఖ్య ( ఐ ఎఫ్ టి యు) జాతీయ జనరల్ కౌన్సిల్ సమావేశాలు ఈనెల 21,22 వ తేదీలలో జరగబోతున్నాయి. ఈ జనరల్ కౌన్సిల్ సమావేశాలలో పాల్గొని వికారాబాద్ ప్రాంతం కార్మికుల సమస్యల పైన చర్చించడం కొరకు వికారాబాద్ జిల్లాలో ని రాష్ట్ర నాయకురాలు వై గీత బయలుదేరి వెళుతున్నారు. ఈ సందర్భంగా వై గీత ( ఐ ఎఫ్ టి యు) భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర నాయకురాలు మాట్లాడుతూ 2023 ఏప్రిల్ లో తిరుపతిలో గత జాతీయ మహాసభల లో తీసుకున్న నిర్ణయాలను అమలు చేసిన పద్ధతిని చర్చించి కొత్త తీర్మానాలను ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉంటుందన్నారు. కార్యక్రమంలో భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐ ఎఫ్ టి యు) రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.



## ప్రజా నాయకురాలను ఎన్నుకున్న గాంధారి ప్రజలకు కృతజ్ఞతలు

### జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్ రెడ్డి

**రామారెడ్డి, డిసెంబర్ 18, రాజముద్ర న్యూస్ :** కామారెడ్డి జిల్లా గాంధారి ప్రజలను ఎన్ని రకాలుగా ప్రలోభాలకు గురి చేయలో అన్ని రకాలుగా ప్రలోభాలకు గురిచేసిన, ప్రజలంతా ప్రజా నాయకురాలు రేణుక సంజయ్ ను ఎన్నుకోవడం పట్ల గాంధారి ప్రజలకు జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ కృతజ్ఞతలు తెలిపారు. గురువారం గాంధారిలో నూతన సర్పంచ్ గా ఎన్నుకున్న రేణుక సంజీవుల దంపతులను శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాభివృద్ధి ధ్యేయంగా, ప్రజా సమస్యలే పరిష్కారంగా పనిచేసి ప్రజల గుండెల్లో నిలిచిపోయిన మాజీ సర్పంచ్ సంజీవ్ సేవలను గుర్తు చేసుకొని, గాంధారి అభివృద్ధి కోసం సంజీవ్ సతిమని రేణుకను ఎన్నుకొనడం గాంధారి ప్రజలు తీసుకున్న నిర్ణయం గొప్ప నిర్ణయమని అన్నారు. రాబోయే స్థానిక సంస్థలైన ఎంపీటీసీ , జెడ్పిటిసి ఎన్నికల్లో ప్రజల కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేసే స్థానిక నాయకున్ని ఎన్నుకోవాలని సూచించారు. కార్యక్రమంల జిల్లా కోపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ సాయికుమార్, గాంధారి మార్కెట్ కమిటీ చైర్మన్ పరమేష్, జువ్వాడి మాజీ సర్పంచ్ సంగయ్య, రగోతంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన మహేష్

**ఆత్మకూర్( ఎం) రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్( ఎం).మండల కూరెళ్ళ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన ఎల్లంకి ఇందిరమ్మ,ఇటీవల అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబానికి ఇటీవల ఎంపిక అయినా 9వ వార్డు మెంబర్ కోరుకొప్పుల మహేష్ 50 కేజీ ల బియ్యంనీ అందజేశారు .. ఈ కార్యక్రమం లో గ్రామస్తులు ఉప్పల మాచ్చగిరి, కొంపల్లి నాగరాజు,ఉప్పల శ్రీను, జిట్ట నాగరాజు, కురెళ్ళ మాణికుమార్, రాంపాక ఉపేందర్ పాల్గొన్నారు.



## బంగ్లాదేశ్‌లో.. రెండు వీసా కేంద్రాలను మూసివేసిన భారత్

**ఢాకా :** బంగ్లాదేశ్‌లోని భారత రాయబార కార్యాలయాన్ని ముట్టడించేందుకు ఆందోళన లు జరిగిన నేపథ్యంలో భారత్ కీలక చర్యలు తీసుకుంది. అక్కడి రెండు వీసా కేంద్రాలను తాత్కాలికంగా మూసివేసింది. భద్రతా కారణాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంబం ధిత వర్గాలు పేర్కొన్నాయి. అయితే, ఢాకాలోని వీసా కేంద్రాన్ని ఇటీవల మూసివేయగా.. నేడు దాన్ని తిరిగి తెరిచినట్లు సమాచారం. "భద్రతా పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రాజ్‌షాహి, ఖుల్నాల లోని భారత వీసా కేంద్రాలను మూసివేస్తున్నాం. గురువారం షెడ్యూల్ అయిన అపాయిం ట్‌మెంట్లకు మరో తేదీలో అవకాశం కల్పిస్తాం" అని బంగ్లాదేశ్‌లోని ఇండియన్ వీసా అప్లికేషన్ సెంటర్ అధికారిక ప్రకటనలో పేర్కొంది. బంగ్లా దేశ్‌లో మొత్తం ఐదు భారత వీసా కేంద్రాలున్నాయి. ఢాకా, రాజ్‌షాహి, ఖుల్నాల తోపాటు చత్తోగ్రామ్, సిల్‌హెత్ నగరాల్లో ఈ కేంద్రాలు కొనసాగుతున్నాయి.

## బంగ్లాలో రాజకీయ సంక్షోభం భారత్‌కు ముప్పే

### షేక్ హసీనా కుమారుడు సాజిబ్‌వాజేద్



**బంగ్లాదేశ్ :** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా కుమారుడు సాజిబ్‌వాజేద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బంగ్లాలో రాజకీయ సంక్షోభం భారత్‌కు పెద్ద ముప్పు అని పేర్కొన్నారు. ఆ దేశంలో ఇప్పటికే ఉగ్రవాద శిక్షణ శిబిరాలు నెలకొన్నాయని ఆరోపించారు. ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూ లో మాట్లాడుతూ సాజిబ్ ఈ వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో బంగ్లాలో ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. దీనిపై స్పందిస్తూ.. ప్రజా స్వామ్యాలను అణగదొక్కేలా ప్రస్తుత తాత్కాలిక ప్రభుత్వం విధానాలను అనుసరిస్తోందని ఆరోపించారు. ఇస్లామిక్ పార్టీలకు అధికారం కట్టబెట్టాలనే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఈ మార్పు భారత భద్రతపై ప్రత్యక్షమైన ప్రభావం చూపనుందన్నారు. 'బంగ్లాలో ఇప్పటికే ఉగ్రవాద శిక్షణ శిబిరాలు పుట్టుకొచ్చాయి. ఉగ్రసంస్థ అల్‌ఖైదాకు చెందిన వ్యక్తులు అక్కడ చురుకుగా పనిచేస్తున్నారు. పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తయ్యిబా కమాండర్లు బహిరంగ కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడుతున్నారు. ఇవన్నీ భారత్‌కు ముప్పే. ఇది వాస్తవం' అని సాజిబ్ అన్నారు. జమాతే ఇస్లామీ వంటి ఇతర ఇస్లామిక్ పార్టీలకు తాత్కాలిక ప్రభుత్వం అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తోందని ఆరోపించారు. అలాంటి శక్తుల ప్రభావంతో బంగ్లాలో అస్థిరత నెలకొంటుందన్నారు. ఇది సరిహద్దు దేశమైన భారత్‌కు కూడా ముప్పేనని హెచ్చరించారు. దేశంలోని సగం మంది ఓటర్లను తాత్కాలిక ప్రభుత్వం రద్దు చేస్తోందని ఆరోపించారు. గతంలో ఇస్లామిక్ సంస్థలపై అవామీ లీగ్ పాలనలో విధించిన ఆంక్షలను యూనస్ ప్రభుత్వం సడలించిందన్నారు. భారత్‌కు వ్యతిరేకంగా ఉన్న పాక్ వంటి దేశాలతో అంటకాగుతుందని ఆరోపించారు. తమ అవామీ లీగ్ అధికారంలో ఉన్నప్పుడు భారత తూర్పు సరిహద్దులను ఉగ్రవాదుల నుంచి సురక్షితంగా ఉంచిన విషయాన్ని గుర్తుచేశారు. ఇక, బంగ్లాలో ప్రజాస్వామ్యం తిరిగి రావాలని, ఎన్నికలు స్వేచ్ఛగా జరగాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.





## హెచ్-1బీ వీసా దరఖాస్తుదారులకు కష్టకాలం

**న్యూఢిల్లీ :** అమెరికా తీసుకొచ్చిన కొత్త సోషల్ మీడియా వెట్టింగ్ పాలసీతో భారత హెచ్-1బీ దరఖాస్తుదారులకు కష్టకాలం ఎదురైంది. ఈ విధానం వల్ల వీసా కోసం దరఖాస్తుదారులు వచ్చే ఏడాది అక్టోబరు దాకా ఎదురుచూడాల్సిన పరిస్థితి తలెత్తింది. చాలామంది దరఖాస్తుదారుల వీసా అపాయింట్‌మెంట్లు 2026 అక్టోబరు నెలాఖరుకు వాయిదా పడినట్లు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. డిసెంబరు-జనవరిలో జరగాల్సిన హెచ్-1బీ, హెచ్-4 వీసా ఇంటర్వ్యూలను వచ్చే ఏడాది ఫిబ్రవరి-మార్చికి రీషెడ్యూల్ చేసినట్లు ఇటీవల అమెరికా ఎంబసీ అధికారులు వెల్లడించిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ ప్రక్రియ మరింత ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది. వీరి ఇంటర్వ్యూ తేదీలను ఇప్పుడు అక్టోబరు నెలకు వాయిదా వేసినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. వీసా దరఖాస్తుదారుల సోషల్ మీడియా ఖాతాలను క్షుణ్ణంగా స్క్రీనింగ్ చేసేందుకు అదనపు సమయం పడుతోందని, అందువల్లే ఇంటర్వ్యూలను వాయిదా వేస్తున్నట్లు అమెరికా అధికారులు చెబుతున్నారు. దీంతో దరఖాస్తుదారుల పరిస్థితి గందరగోళంలో పడింది. ఇప్పటికే అమెరికాలో ఉద్యోగాలు సాధించి.. ప్రయాణాల కోసం టికెట్లు బుక్ చేసుకున్నవారు ఇబ్బందులు పడుతున్నారు. డిసెంబరు 15వ తేదీ నుంచి హెచ్1బీ, హెచ్4 వీసా దరఖాస్తుదారులకు సోషల్ వెట్టింగ్‌ను అమెరికా ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇందుకు వీలుగా దరఖాస్తుదారులు తమ సోషల్ మీడియా ఖాతాలను ప్రైవేటు నుంచి పబ్లిక్‌కు మార్చుకోవాలని అమెరికా విదేశాంగ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జాతీయ భద్రతలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అగ్రరాజ్యం తెలిపింది.

# సిడ్నీ ఉగ్ర దాడి ఘటన

### దర్యాప్తులో భారత బృందం..



**సిడ్నీ :** ఆస్ట్రేలియాలో మారణహోమం సృష్టించిన ఉగ్రవాది సాజిద్ అక్రమ్ (50)ను హైదరాబాదీగా గుర్తించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఉగ్రదాడి దర్యాప్తులో ఆస్ట్రేలియా అధికారులకు సాయం చేసేందుకు ఓ బృందాన్ని అక్కడికి పంపించాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఉగ్రదాడి నిందితుల్లో ఒకరైన సాజిద్ భారత పాస్‌పోర్టును కలిగి ఉండటంతో పాటు నాలుగేళ్ల క్రితం అతడు ఇక్కడికి వచ్చినట్లు తెలంగాణ డీజీపీ కార్యాలయం పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే దర్యాప్తులో భాగం కావాలని భారత్ భావిస్తోందని అధికార వర్గాలు తెలిపాయి. ఈ దర్యాప్తు బృందంలో రాష్ట్ర పోలీసు విభాగాలు, కేంద్ర నిఘా సంస్థలకు చెందిన అధికారులు ఉంటారని వెల్లడించాయి. యూదులను లక్ష్యంగా చేసుకొని హింసకు పాల్పడిన వ్యక్తి నేపథ్యం, చేసిన ప్రయాణాల గురించి తెలుసుకునేందుకు ఆస్ట్రేలియా అధికారులతో కలిసి పని చేయనున్నట్లు తెలిపాయి. నాలుగేళ్ల క్రితం నిందితుడు తన తల్లిని కలిసేందుకు చేసిన భారత పర్యటనపై కూడా దృష్టిసారించనున్నట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. భారత్‌కు వచ్చిన ఉద్దేశం, వెళ్లిన ప్రదేశాలు, కలిసిన వ్యక్తుల గురించి దర్యాప్తు బృందం తెలుసుకోనుందట. నిందితుడికి ఉగ్రవాద సంస్థలతో ఎలాంటి సంబంధాలు ఉన్నాయనే దానిపైనా దృష్టి సారించినట్లు సమాచారం. భారత్‌లో అతడికున్న పరిచయాలు, స్లీపర్ సెల్స్ ఎవరినైనా నియమించాడా అనే కోణంలో కూడా విచారణ జరపనున్నట్లు తెలుస్తోంది. అక్రమ్‌కు సంబంధించిన ఆన్‌లైన్ కార్యకలాపాలు, ఆర్థిక లావాదేవీలపై భారత దర్యాప్తు ఏజెన్సీలు ఇప్పటికే దృష్టిపెట్టాయి. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగానే ఈ దర్యాప్తులో పాల్గొనడం అవసరమని అధికార వర్గాలు తెలిపాయి. సిడ్నీలోని బోండీ బీచ్‌లో ఆదివారం యూదులు 'హనుక్కా ఉత్సవం చేసుకుంటుండగా ఈ ఉగ్రదాడి జరిగిన సంగతి తెలిసిందే. సాజిద్ అక్రమ్, అతడి కుమారుడు నవీద్ అక్రమ్‌లు విచక్షణారహితంగా కాల్పులకు పాల్పడ్డారు. ఈ సమాచారమందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని ఎదురుకాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో సాజిద్ హతమవగా.. నవీద్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరికి ఉగ్రవాద సంస్థ ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా(ఐసిస్)తో సంబంధాలున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో 15 మంది ప్రాణాలు కోల్పోయారు.

## తాగడానికి నీళ్లే లేవు.. బాటిళ్లకు నాణ్యత కోసం పిటిషనా?

### సుప్రీంకోర్టు ఆగ్రహం



**న్యూఢిల్లీ :** నీళ్ల బాటిళ్లకు అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలను పాటించడం లేదంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మన దేశంలోని చాలా ప్రాంతాల్లో ప్రజలకు కనీస తాగు నీరే అందడం లేదని అత్యున్నత న్యాయ స్థానం తెలిపింది. ఇది కేవలం 'లగ్జరీ వ్యాజ్యమే' అంటూ పిటిషన్‌ను తిరస్కరించింది. ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ నాణ్యతా ప్రమాణాలను మెరుగుపర్చేలా ఆదేశాలు జారీ చేయాలంటూ సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలైంది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చితో కూడిన ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. "ఇది అర్బన్-రిచ్ మనస్తత్వంతో వేసిన పిటిషనే. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ చాలా మందికి తాగు నీటి సరఫరా సరిగా లేదు. వారు శుద్ధి చేయని జలాలపై ఆధారపడుతున్నారు. ముందు వారి సంగతి ఆలోచిద్దాం. నీళ్ల బాటిళ్ల నాణ్యత గురించి తర్వాత చూద్దాం" అని ధర్మాసనం తెలిపింది. "అమెరికా, జపాన్, ఈయూ మార్గదర్శకాలను మన దేశంలో ప్రవేశపెట్టగలమా? అనే విషయాన్ని మీరు ఆలోచించుకోవాలి. భారత్‌లోని వాస్తవిక పరిస్థితులను తెలుసుకోవాలి. గాంధీజీ దేశానికి వచ్చినప్పుడు.. ఆయన చాలా మారుమూల ప్రాంతాల్లో పర్యటించారు. మీరు కూడా అలా అభివృద్ధికి నోచుకుని ప్రాంతాలను సందర్శించండి. అక్కడి ప్రజలు తాగునీటి కోసం ఎలాంటి ఇబ్బందులు పడుతున్నారో చూడండి. అప్పుడు మీకు మన దేశం అంటే ఏంటో అర్థమవుతుంది" అని పిటిషనర్‌కు సుప్రీం కోర్టు ధర్మాసనం సూచించింది.

## అమెరికాలో ఎంతకాలం ఉండొచ్చు..?

### వీసా గడువుపై ఎంబసీ ఏం చెబుతోందంటే..




**యూఎస్ :** సాధారణంగా అమెరికా వీసాపై గడువు తేదీని పేర్కొంటారు. అప్పటివరకు అగ్రరాజ్యంలో చట్టబద్ధంగా ఉండొచ్చని చాలా మంది అనుకుంటారు. అయితే, అది వాస్తవం కాదని వెల్లడించింది భారత్‌లోని అమెరికా ఎంబసీ. అమెరికాలో ఎంతకాలం ఉండొచ్చనే దానిపై మరోసారి స్పష్టతనిస్తూ.. తాజాగా తమ 'ఎక్స్' ఖాతాలో ఓ పోస్ట్ చేసింది. "అంతర్జాతీయ పర్యాటకులు అమెరికాలో ఎంతకాలం ఉండొచ్చనేది వారి వీసా గడువు తేదీపై ఆధారపడి ఉండదు. మీరు అగ్రరాజ్యంలోకి రాగానే.. కస్టమ్స్ అండ్ బార్డర్ ప్రొటెక్షన్ అధికారి దాన్ని నిర్ణయిస్తారు. మీరు ఎంతకాలం ఉండొచ్చనేది తెలుసుకోవాలంటే.. మీ 'ఐ-94' పత్రంపై ఉండే వివరాలను చెక్ చేసుకోవాలి" అని ఎంబసీ తమ పోస్ట్‌లో రాసుకొచ్చింది. కాగా.. రెండు నెలల క్రితం కూడా అమెరికా దౌత్యకార్యాలయం ఇదే విధమైన సూచనలు చేసింది. వలసదారులు, విదేశీ పర్యాటకులపై ట్రంప్ ప్రభుత్వం కఠిన ఆంక్షలు అమలు చేస్తోన్న నేపథ్యంలో ఎంబసీ ముందుజాగ్రత్తగా హెచ్చరికలు చేస్తోంది. గతంలోనూ వీసా గడువు తేదీ దాటిన తర్వాత అగ్రరాజ్యంలో ఉంటే బహిష్కరణ ముప్పు తప్పదని హెచ్చరించిన సంగతి తెలిసిందే. అమెరికా వెళ్లే చాలా మంది పర్యాటకులకు ఐ-94 పత్రం తప్పనిసరి. అమెరికాలోకి ప్రవేశించగానే కస్టమ్స్ అధికారులు ఈ ఫారమ్‌పై పర్యాటకుల గడువు తేదీని నమోదు చేస్తారు. అప్పటివరకు మాత్రమే అగ్రరాజ్యంలో చట్టబద్ధంగా ఉండే అవకాశం ఉంటుంది. ఈ తేదీ.. వీసాలపై ఉండే గడువు తేదీతో సరిపోలాల్సిన అవసరం లేదు. చాలా సందర్భాల్లో వీసా గడువు తీరే తేదీ కంటే ముందే ఐ-94 ఫారమ్‌లో చివరి తేదీ ఉంటుంది.




## ఒమన్ చేరుకున్న ప్రధాని మోదీ

**మస్కట్:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇథియోపియా పర్యటనను ముగించుకొని బుధవారం ఒమన్ చేరుకున్నారు. ఉప ప్రధాని (రక్షణ వ్యవహారాలు) సయ్యిబ్ షిహాబ్ బిన్ తారిక్ అల్ సయిద్‌తో సమావేశమై పలు ద్వైపాక్షిక, ప్రాంతీయ అంశాలపై చర్చించారు. ఇరు దేశాల మధ్య ఉన్న మైత్రీ బంధాన్ని మరింత బలోపేతం చేసుకునే దిశగా సమాలోచనలు జరిపారు. భారత్-ఒమన్ మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 70 ఏళ్లవుతుండటాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఓ ఎగ్జిబిషన్‌ను మోదీ తిలకించారు. ఆయన ఒమన్‌లో పర్యటించడం ఇది రెండోసారి. ఈ పర్యటనలో భాగంగా ఒమన్ సుల్తాన్ తారిక్‌తో ప్రధాని భేటీ అవుతారు. భారత సంతతి ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. మోదీ పర్యటనలో ఇరు దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశాలు ఉన్నాయి.

## 'టారిఫ్' పదం నాకెంతో ఇష్టం

### డొనాల్డ్ ట్రంప్



**యూఎస్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమ దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. తన పదవి కాలంలో మెరుగుపడిన ఆర్థిక వ్యవస్థ, సరిహద్దు భద్రత, వలస విధానాలు, దేశాలపై టారిఫ్‌లు తదితర అంశాల గురించి ప్రస్తావించారు. భారత్-పాక్ సహా పలు యుద్ధాలు ఆపానంటూ మరోసారి చాటింపు వేసుకున్నారు. ఈ సందర్భంగా అమెరికాకు చెందిన ప్రతి సైనికుడికి ట్రంప్ 1,776 డాలర్ల నగదు బహుమతి ప్రకటించారు. "10 నెలల్లో ఎనిమిది యుద్ధాలు ఆపా. ఇరాన్ అణుముప్పును అడ్డుకున్నా. గాజా యుద్ధం ఆపి.. పశ్చిమాసియాలో తొలిసారి శాంతిని నెలకొల్పా" అని అమెరికా అధ్యక్షుడు పేర్కొన్నారు. ఈ సందర్భంగా టారిఫ్‌ల గురించి స్పందిస్తూ.. అమెరికాలో 18 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు సాధించగలిగామని తెలిపారు. సుంకాల కారణంగానే ఇదంతా సాధ్యమైందన్నారు. 'టారిఫ్' అనే పదం తనకు చాలా ఇష్టమని, అనేక దశాబ్దాల పాటు ఇతర దేశాలు అమెరికాకు వ్యతిరేకంగా దీన్ని వినియోగించాయన్నారు. ఇకపై అది కుదరదని వ్యాఖ్యానించారు. అమెరికాలో తయారుచేసే వాటికి సుంకాలు ఉండవనే కారణంతో అనేక కంపెనీలు దేశానికి తిరిగి వస్తున్నాయన్నారు. ఇక, క్రిస్మస్ సందర్భంగా ప్రతి అమెరికన్ సైనికుడికి 1,776 డాలర్ల నగదు బహుమతి ఇవ్వనున్నట్లు ట్రంప్ ప్రకటించారు. సాయుధ దళాల సేవ, త్యాగాలకు గుర్తుగా.. దీనికి 'వారియర్ డివిడెండ్'గా పేర్కొన్నారు. 1.45 మిలియన్‌లకు పైగా ఉన్న సైనిక సిబ్బందికి క్రిస్మస్‌కు ముందే దీన్ని అందించనున్నట్లు తెలిపారు.

## కష్టకాలం ముగిసింది : ఇండిగో సీఈవో



**న్యూఢిల్లీ :** ఇండిగో సంక్షోభం సమయంలో తమకు అండగా నిలిచిన సిబ్బందికి ఆ విమానయాన సంస్థ సీఈవో పీటర్ ఎల్బర్స్ ధన్యవాదాలు తెలిపారు. ఇండిగో ఉద్యోగులను ఉద్దేశిస్తూ ఆయన ఓ వీడియో విడుదల చేశారు. ఈ సందర్భం గా ఎయిర్‌లైన్ రోజువారీ సర్వీసులు పునరుద్ధరించామని వెల్లడించారు. 'చాలా పెద్ద సవాలు నుంచి బయటపడ్డాం. ఇండిగో ఉద్యోగులు, మేము ఒకరికొకరం మద్దతుగా నిలిచి ఈ తుపాన్‌ను ఎదుర్కొ న్నాం. బలంగా నిలబడ్డాం. మాకు మద్ద తుగా నిలిచిన పైలట్లు, క్యాబిన్, ఎయిర్‌పోర్టు సిబ్బంది, కస్టమర్ సర్వీస్.. ఇలా అన్ని విభాగాలకు ధన్యవాదాలు. ఇండిగోకు అండగా నిలిచారు' అని రాసు కొచ్చారు. విమానాల రద్దుకు ఇదీ కారణం అని చెప్పలేమని, అనేక అంశాలు ప్రభావితం చేశాయన్నారు. ఇకపై ఉద్యోగులు ప్రశాంతంగా ఉండాలని, వారు బాధ్యతలపై దృష్టిపెట్టాలని కోరారు. సంక్షోభానికి సంబంధించి వస్తున్న ఊహాగానాలకు దూరంగా ఉండాలని అభ్యర్థించారు. అంతరాయాల సమయం లో ఉద్యోగులు ఎదుర్కొన్న సవాళ్లు, ఇబ్బందుల గురించి తెలుసుకునేందుకు సీఈవోతో సహా నాయకత్వ బృందం పనిచేస్తోందని తెలిపారు. 'ఇండిగో ఇప్పుడు దాదాపు 65వేల మంది ఉద్యోగులను కలిగిఉంది. ఇప్పటివరకు 850 మిలియన్లకు పైగా కస్టమర్లకు సేవలందించింది. అత్యంత భద్రతా ప్రమాణా లను పాటిస్తోంది. ఏ లక్ష్యంతో ఈ సంస్థను ప్రారంభించామో.. ఆ విధంగానే భారత్‌లో సేవలందిస్తున్నాం' అని అన్నారు. ఇక, డిసెంబరు 2 నుంచి దేశవ్యాప్తంగా వందలాది ఇండిగో విమానాలు రద్దయ్యాయి. అనేకరోజుల పాటు ఇది కొనసాగింది. ఈక్రమంలో ప్రయాణికులు అవస్థలు పడ్డారు.

# 'ఉపాధి' స్థానంలో 'జీ రామ్ జీ'కి లోక్‌సభ ఆమోదం

### బిల్లు ప్రతులు చించేసిన విపక్ష ఎంపీలు

**న్యూఢిల్లీ :** 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' (ఎంజీనరేగా)ను రద్దు చేసి దాని స్థానంలో కొత్త చట్టం తీసుకొచ్చేందుకు ఉద్దేశించిన 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్-గ్రామీణ్' (వీబీ జీ రామ్ జీ) బిల్లుకు లోక్‌సభ గురువారం ఆమోదం తెలిపింది. ఈ బిల్లుపై చర్చ సందర్భంగా విపక్షాలు పెద్దఎత్తున నిరసన వ్యక్తంచేశాయి. వారి ఆందోళన నడుమ స్పీకర్ ఓటింగ్ నిర్వహించగా.. బిల్లుకు ఆమోదం లభించింది. ఈ సమయంలో విపక్ష ఎంపీలు వెల్‌లోకి వచ్చి నిరసన చేపట్టాయి. కొందరు ప్రతిపక్ష నేతలు 'వీబీ జీ రామ్ జీ' బిల్లు ప్రతులను చించి విసిరేశారు. ఈ గందరగోళం నేపథ్యంలో లోక్‌సభ శుక్రవారానికి వాయిదా పడింది. అంతకుముందు బిల్లుపై చర్చ సందర్భంగా విపక్షాల ఆరోపణలకు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ బదులిచ్చారు. మహాత్మాగాంధీ సిద్ధాంతాలకు అనుగుణంగానే మోదీ ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందన్నారు. "బాపూ సిద్ధాంతాలను కాంగ్రెస్ సర్కారు చంపేసింది. కానీ, ఎన్డీయే ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేస్తోంది. పీఎం ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, స్వచ్ఛభారత్ మిషన్, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలతో గాంధీజీ కలలను మేం సాకారం చేస్తున్నాం" అని తెలిపారు.




### ఎన్నికల కోసమే గాంధీ పేరు చేర్చి..

ఈ సందర్భంగా గత కాంగ్రెస్ పాలనపై ఆయన విరుచుకుపడ్డారు. "తొలుత ఉపాధి హామీ పథకానికి నరేగా అనే పేరు ఉండేది. ఆ తర్వాత 2009లో లోక్‌సభ ఎన్నికల సమయంలో ఓటర్లను ఆకర్షించేందుకు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకానికి మహాత్మాగాంధీ పేరు చేర్చింది. అంతేకాదు.. వారి హయాంలో ఈ పథకం అమలులో అనేక లోటుపాట్లు చోటుచేసుకున్నాయి. కూలీలపై ఎక్కువ ఖర్చు చేసి.. మెటీరియల్ కొనుగోలుకు తక్కువ వెచ్చించారు" అని చౌహాన్ మండిపడ్డారు. పేరు మార్పుపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ విమర్శలను ప్రస్తావిస్తూ.. గతంలోనే అనేక పథకాలకు కాంగ్రెస్ గాంధీ-నెహ్రూ పేర్లు పెట్టిన విషయాన్ని గుర్తుచేశారు. పల్లె ప్రాంత నిరుపేదలకు ఉపాధి కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, గ్రామీణ ప్రాంతాల్లో సుస్థిర ఆస్తుల కల్పన, వనరుల ఉత్పాదకత, అభివృద్ధి లక్ష్యాలుగా దాదాపు రెండు దశాబ్దాల కిందట 'ఎన్‌ఆర్‌ఈజీఏ' చట్టాన్ని 2005లో అప్పటి యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చింది. తర్వాత 2009లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంగా పేరు మార్చారు.

# ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. ఉదయం నష్టాల్లో ప్రారంభమైన సూచీలు.. తర్వాత లాభపడ్డాయి. ఆఖర్లో మళ్లీ అమ్మకాల ఒత్తిడితో నష్టాల్లోకి జారుకుని స్వల్ప నష్టాలకు పరిమితమయ్యాయి. ఫైనాన్షియల్, టెక్నాలజీ, మెటల్ అనుబంధ షేర్లలో కొనుగోళ్ల మద్దతు కనిపించగా.. ఆటో, మీడియా, ఫార్మా అండ్ కెమికల్ షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ ఉదయం 84,518.33 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 84,559.65) నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 84,238.43 - 84,780.19 మధ్య కదలాడింది. చివరికి 77.84 పాయింట్ల నష్టంతో 84,481.81 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కేవలం 3 పాయింట్లు నష్టపోయి 26,815.55 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.26గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో సన్‌ఫార్మా, టాటా స్టీల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఏషియన్ పెయింట్స్, ఎన్టీపీసీ షేర్లు నష్టాల్లో ముగిశాయి. టీసీఎస్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 59.82 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4,325 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.








## యాషెస్ సిరీస్

### ముగిసిన రెండో రోజు ఆట.. ఇంగ్లాండ్ స్కోర్ 213/8

యాషెస్ సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ అడిలైడ్ వేదికగా మూడో టెస్ట్ మ్యాచ్‌లో తలపడుతున్నాయి. 326/8 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆట ప్రారంభించిన ఆస్ట్రేలియా 91.2 ఓవర్లలో 371 పరుగుల భారీ స్కోర్ చేసి ఆలౌటైంది. మిచెల్‌స్టార్క్ (54, 75 బంతుల్లో, 9 ఫోర్లు) హాఫ్ సెంచరీ చేసి ఔటయ్యాడు. మొదటిరోజు అలెక్స్ కేరీ సెంచరీ (106, 143 బంతుల్లో, 8 ఫోర్లు, 1 సిక్స్), ఉస్మాన్ ఖవాజా హాఫ్ సెంచరీ (82, 126 బంతుల్లో, 10 ఫోర్లు) సాధించిన విషయం తెలిసిందే. ఇంగ్లాండ్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్ 5, బ్రైడన్ కార్స్, విల్ జాక్స్ తలో రెండు వికెట్లు, జోష్ టంగ్ 1 వికెట్ తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన ఇంగ్లాండ్ రెండోరోజు ఆట ముగిసే సమయానికి 68 ఓవర్లకు 8 వికెట్లు నష్టపోయి 213 పరుగులు చేసింది. జాక్ క్రాలీ (9), ఓలీపోప్ (3), జో రూట్ (19), జెమీ స్మిత్ (22), బెన్ డకెట్ (29), విల్ జాక్స్ (6) బ్యాటింగ్‌లో విఫలయ్యారు. హ్యారీ బ్రూక్ (45) రాణించాడు. ప్రస్తుతం క్రీజులో బెన్‌స్టోక్స్ (45బీ 151 బంతుల్లో, 3 ఫోర్లు), జోఫ్రా ఆర్చర్ (30బీ 48 బంతుల్లో, 4 ఫోర్లు) ఉన్నారు. ఇంగ్లాండ్ ఇప్పటికీ మరో 158 పరుగులు వెనకబడి ఉంది. ఆస్ట్రేలియా బౌలర్లలో పాట్ కమిన్స్ 3, నాథన్ లైయన్, స్కాట్ బోలాండ్ చెరో రెండు, కామెరూన్ గ్రీన్ ఓ వికెట్ తీసుకున్నారు.



## మాట వినని అభిమాని..

### సహనం కోల్పోయిన బుమ్రా

ఎప్పుడూ కూల్ అండ్ కామ్‌గా కనిపించే టీమ్‌ఇండియా స్టార్ బౌలర్.. జస్‌ప్రీత్ బుమ్రాకు ఓ అభిమాని కోపం తెప్పించాడు. తన అనుమతి లేకుండా.. ఓ ఫ్యాన్ ఎయిర్‌పోర్ట్‌లో తనతో సెల్ఫీ వీడియో తీసుకుంటున్నాడు. అది గమనించిన బుమ్రా హెచ్చరించాడు. అయినా ఆ అభిమాని పెడచెవినపెట్టడంతో చేసేదిలేక, అసహనానికి గురైన జస్‌ప్రీత్ బుమ్రా ఆ ఫ్యాన్ ఫోన్‌ను లాక్కున్నాడు. ఆ క్లిప్ అంతటితో ముగిసింది. తర్వాత ఏం జరిగిందో తెలియదు. ఈ వీడియో మాత్రం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అయితే సామాజిక మాధ్యమాల్లో దీనిపై మిశ్రమ స్పందనలు వస్తున్నాయి. మాట వినని అభిమానిని కొందరు తప్పుపడుతుంటే.. మరికొందరు ఫ్యాన్ ఫోన్ లాక్కున్న బుమ్రాను విమర్శిస్తున్నారు. జస్‌ప్రీత్ బుమ్రా ప్రస్తుతం టీమ్‌ఇండియా.. దక్షిణాఫ్రికా అయిదు టీ20 సిరీస్‌లో భాగమయ్యాడు. తొలి రెండు మ్యాచుల్లో ఆడినా, మూడో మ్యాచ్‌కు దూరమయ్యాడు. లఖ్‌నవూ వేదికగా జరగాల్సిన నాలుగో మ్యాచ్ పొగమంచు కారణంగా రద్దైన విషయం తెలిసిందే. దీనికి ముందు బుమ్రా జట్టులో వచ్చి చేరాడు. మ్యాచ్‌కు ముందు వార్మప్ సెషన్‌లోనూ పాల్గొన్నాడు. ఈ సిరీస్‌లో చివరిదైన అయిదో టీ20 శుక్రవారం అహ్మదాబాద్ వేదికగా జరగనుంది.

# ఇకపై మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటాం

### బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా



టీమ్ ఇండియా, దక్షిణాఫ్రికాల మధ్య బుధవారం లఖ్‌నవూలో జరగాల్సిన నాలుగో టీ20 మ్యాచ్ పొగమంచు కారణంగా ఒక్క బంతి కూడా పడకుండా రద్దైన విషయం తెలిసిందే. దీంతో అభిమానులు తమ ఆగ్రహాన్ని వ్యక్తంచేశారు. వేదికల ఎంపిక విషయంలో వాతావరణ పరిస్థితులను బీసీసీఐ పరిగణనలోకి తీసుకోలేదని వారు ఆరోపించారు. ఈ నేపథ్యంలో బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా స్పందించాడు. ఇకపై మ్యాచ్‌లు జరిగే వేదికల ఎంపిక విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. 'లఖ్‌నవూలో టీ20 రద్దు కావడం అందరినీ నిరాశకు గురిచేసింది. మ్యాచ్ కోసం అన్ని ఏర్పాట్లు చేశాం. చివరి నిమిషం వరకు మ్యాచ్‌ను జరిపించేందుకు ప్రయత్నించాం. కానీ పొగమంచు వల్ల రద్దు చేయాల్సి వచ్చింది. డిసెంబర్ 15 నుంచి జనవరి 15 వరకు పొగమంచు చాలా పెద్ద సమస్య. ఇకపై భవిష్యత్తులో మ్యాచ్‌ల షెడ్యూళ్ల విషయంలో ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుంటాం' అని రాజీవ్ శుక్లా అన్నారు. సాయంత్రం 6:30కు పడాల్సిన టాస్.. పలుమార్లు వాయిదా పడుతూ వచ్చింది. అంపైర్లు మొత్తంగా దాదాపు ఆరుసార్లు మైదానాన్ని తనిఖీ చేశారు. అయితే ఆటను ప్రారంభించే పరిస్థితులు కనిపించకపోవడంతో, చివరకు రాత్రి 9:30కు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో అభిమానులు ఆగ్రహం వ్యక్తంచేశారు. సోషల్ మీడియా వేదికగా బీసీసీఐ ప్రణాళికా లోపాన్ని వేలెత్తి చూపారు. లఖ్‌నవూలోని స్థానిక అభిమానులు సైతం మ్యాచ్‌ను రాత్రి పూట కాకుండా, పగటి పూట నిర్వహించి ఉంటే బాగుండేదన్నారు. దక్షిణాఫ్రికాతో చివరి టీ20 మ్యాచ్ శుక్రవారం (డిసెంబర్ 19) అహ్మదాబాద్ వేదికగా జరగనుంది. అలాగే జనవరి 11 నుంచి న్యూజిలాండ్ జట్టు భారత్‌లో పర్యటించనుంది. ఈ సందర్భంగా టీమ్‌ఇండియా కివీస్‌తో.. వడోదర, రాజ్‌కోట్, ఇండోర్ వేదికగా మూడు వన్డేలు, నాగ్‌పూర్, రాయ్‌పూర్, గువాహటి, విశాఖపట్నం, తిరువనంతపురం వేదికగా అయిదు టీ20లు ఆడనుంది.

## మా డబ్బులు మాకివ్వండి

### మ్యాచ్ రద్దుపై అభిమానుల ఆగ్రహం




టీమ్ ఇండియా, దక్షిణాఫ్రికాల మధ్య బుధవారం లఖ్‌నవూలో జరగాల్సిన నాలుగో టీ20 పొగమంచు కారణంగా టాస్ కూడా పడకుండా రద్దైన విషయం తెలిసిందే. సాయంత్రం నుంచి అంపైర్లు పలుమార్లు మైదానాన్ని పరిశీలించారు. వారు చివరగా రాత్రి 9.25కు గ్రౌండ్‌ను తనిఖీ చేసి చివరికి మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో అభిమానులు నిరాశగా మైదానం నుంచి వెనుదిరిగారు. ఈ సందర్భంగా పలువురు ప్రేక్షకులు తమ ఆగ్రహాన్ని వ్యక్తంచేశారు. చాలా కష్టపడి మ్యాచ్ టిక్కెట్లు కొనుగోలు చేశామని, ఆ నగదు వెనక్కి ఇప్పించాలని డిమాండ్ చేశారు. మరికొందరు డబ్బులు తిరిగి చెల్లించడం దీనికి పరిష్కారం కాదని, మేం టీమ్‌ఇండియా మ్యాచ్ చూడాలనుకున్నామని తెలిపారు. లఖ్‌నవూలో కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి ఉంది. అలాంటప్పుడు మ్యాచ్‌ను రాత్రి పూట కాకుండా, మధ్యాహ్నం నిర్వహిస్తే బాగుండేదంటున్నారు. బీసీసీఐ రిఫండ్ పాలసీ ప్రకారం.. ఒక్క బంతి కూడా పడకుండా మ్యాచ్ రద్దైతే, దానికి సంబంధించిన టికెట్ డబ్బులు తిరిగి ఇచ్చే అవకాశముంది. అనారోగ్యం కారణంగా అక్షర్ పటేల్, గాయం కారణంగా శుభ్‌మన్ గిల్ నాలుగు, అయిదు టీ20లకు దూరమైన విషయం తెలిసిందే. అయిదో టీ20 శుక్రవారం (డిసెంబర్ 19) అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా జరగనుంది. ఈ సిరీస్‌లో ఇప్పటికే టీమ్‌ఇండియా 2-1తో ముందంజలో ఉంది. నాలుగో టీ20 రద్దైన నేపథ్యంలో భారత జట్టు సిరీస్ కోల్పోయే, దక్షిణాఫ్రికా సిరీస్ గెలిచే అవకాశం లేదు. అయిదో టీ20లో భారత్ గెలిస్తే సిరీస్ 3-1తో టీమ్‌ఇండియా వశమవుతుంది. ఒకవేళ దక్షిణాఫ్రికా గెలిస్తే 2-2తో సమమవుతుంది.

# మన క్రికెటర్లకు ఆ అవకాశమే లేదు

### ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ సింగ్ ధుమాల్




ప్రపంచవ్యాప్తంగా ఎన్ని క్రికెట్ లీగులు ఉన్నా.. ఐపీఎల్‌కు ఉన్న క్రేజే వేరు. అలాగే భారత క్రికెటర్లు రిటైర్ అయితే తప్ప విదేశీ లీగుల్లో ఆడటానికి వీల్లేదు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ లాంటి స్టార్ ప్లేయర్లు కేవలం ఐపీఎల్‌లోనే ఫ్రాంఛైజీ క్రికెట్ ఆడగలరు. దీనిపై ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ సింగ్ ధుమాల్ మాట్లాడారు. సమీప భవిష్య త్తులో టీమ్‌ఇండియా క్రికెటర్లు విదేశీ లీగుల్లో ఆడే అవకాశం లేదని తేల్చిచెప్పారు. దీనికి వర్క్‌లోడ్ మేనేజ్‌మెంటే కారణమని ఆయన వివరించారు. 'మన క్రికెటర్లకు ఉన్న వర్క్‌లోడ్‌ను ఒక్కసారి గమనించండి. టీమ్‌ఇండియా ఆటగాళ్లు కచ్చితంగా దేశవాళీల్లో ఆడా లన్న బీసీసీఐ నియమం ఉంది. అందుకే వారు విజయ్ హజా రే ట్రోఫీ ఆడాల్సి ఉంది. అలాగే సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ కూడా. ఇలా భారత్‌లోనే ఆడటానికి చాలా క్రికెట్ ఉంది. ఇక్కడే చాలామంది అభిమానులూ ఉన్నారు. ఈ నేపథ్యంలో వారికి విదేశీ లీగుల్లో ఆడేందుకు అవకాశం ఉంటుందని నేను అనుకోను' అని అరుణ్ సింగ్ ధుమాల్ అన్నారు. 'ప్రస్తుతం పెద్ద ప్లేయర్లు విదేశీ లీగుల్లో ఆడలేరు. వారికి అసలు ఎలా వీలవుతుంది? చాలామంది క్రికెటర్లు మూడు ఫార్మాట్లలో ఆడుతున్నారు. వారికి తీరిక ఎక్కడ ఉంది?. కొంతమంది బౌలర్లకు రెండు టెస్ట్‌ల తర్వాత విశ్రాంతి ఇస్తున్నాం. అలాగే టీ20లు, వన్డేల నుంచి విరామం ఇస్తున్నాం. ఆ సమయంలో వారు విదేశాలకు వెళ్లి ఆడారే అనుకోండి. అది జాతీయజట్టును ఇబ్బందులకు గురిచేస్తుంది కదా' అని ఆయన పేర్కొన్నారు.



## ఆండ్రాయిడ్ యూజర్ల కోసం ట్రూకాలర్ కొత్త ఫీచర్

ప్రముఖ కాలర్ ఐడెంటిఫికేషన్ యాప్ ట్రూకాలర్.. భారత్‌లోని ఆండ్రాయిడ్ యూజర్లకు కొత్త ఫీచర్‌ను తీసుకొచ్చింది. వాయిస్‌మెయిల్ ఫీచర్‌ను లాంచ్ చేసింది. ఇన్‌స్టంట్ ట్రాన్స్‌క్రిప్షన్ సదుపాయంతో వస్తోంది. అంటే వచ్చిన వాయిస్ మెయిల్‌ను మీకు నచ్చిన భాషలోకి అనువదిస్తుంది. ఈ ఫీచర్‌ను పూర్తిగా ఉచితంగా అందిస్తున్నట్లు ట్రూకాలర్ తెలిపింది. ఈ వాయిస్ మెసేజ్‌లు యూజర్ డివైజ్‌లోనే సేవ్ అవుతాయి. వాయిస్‌మెయిల్‌లో స్మార్ట్ కాల్ కేటగరైజేషన్, స్పామ్ ఫిల్టరింగ్, అడ్జస్టబుల్ ప్లేబ్యాక్ స్పీడ్ వంటి సౌకర్యాలు ఉన్నాయి. తెలుగు, హిందీ, బెంగాలీ, మరాఠీ, తమిళం, కన్నడ, మలయాళం, గుజరాతీ, నేపాలీ, పంజాబీ, సంస్కృతం, ఉర్దూ వంటి 12 భారతీయ భాషలకు ఈ యాప్ సపోర్ట్ చేస్తుంది. వాయిస్ మెయిల్ సేవలను రోజువారీ జీవితానికి అనుసంధానం చేసే ఉద్దేశంతో వాయిస్‌మెయిల్ సేవలను తీసుకొచ్చినట్లు ట్రూకాలర్ సీఈవో రిషిత్ ఝున్‌ఝున్‌వాలా పేర్కొన్నారు. ఇన్‌స్టంట్ ట్రాన్స్‌స్క్రిప్షన్, స్పామ్ ప్రొటెక్షన్‌తో ఈ ఫీచర్ వస్తోందని పేర్కొన్నారు. దీనివల్ల ట్రూకాలర్ కాలింగ్ అనుభవం మరింత మెరుగవుతుందని తెలిపారు.




## గూగుల్ పే నుంచి కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డ్

**దిల్లీ:** ప్రముఖ యూపీఐ చెల్లింపుల యాప్ గూగుల్ పే మొదటిసారిగా రూపే నెట్‌వర్క్‌పై కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డు తీసుకొచ్చింది. ఇందుకోసం యాక్సిస్ బ్యాంక్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. మర్చంట్ చెల్లింపుల కోసం ఈ కార్డును ఖాతాదారులు తమ యూపీఐ ఖాతాలకు అనుసంధానం చేసుకోవచ్చు. సాధారణంగా క్రెడిట్ కార్డుల సంస్థలు.. వినియోగదారు చెల్లింపు కాలవ్యవధి ముగింపులో రివార్డులు, క్యాష్‌బ్యాక్‌లు ఇస్తుండగా, తాజా కార్డు మాత్రం తక్షణ క్యాష్‌బ్యాక్, రివార్డులను అందించనుంది. తదుపరి లావాదేవీలోనే వీటిని వినియోగించుకోవచ్చని గూగుల్ సీనియర్ డైరెక్టర్, ప్రొడక్ట్ మేనేజర్ శరత్ బులుసు తెలిపారు. ప్రస్తుతం రూపే-యూపీఐ కార్డులకు ఆదరణ పెరుగుతోంది. క్రెడిట్ కార్డులను యూపీఐ తరహాలో వినియోగించుకునే సౌలభ్యం ఉండటమే ఇందుకు కారణం. మాస్టర్‌కార్డ్, వీసా క్రెడిట్ కార్డులను యూపీఐకు అనుసంధానం చేసుకోలేము. రూపే, యూపీఐలను నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహిస్తోంది.

### ఎలా దరఖాస్తు చేసుకోవాలి?

- గూగుల్‌పే ఫ్లెక్స్ యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డును గూగుల్ పే యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. దీనికి రుసుములూ చెల్లించాల్సిన అవసరం లేదు. పైగా ఎలాంటి పేపర్ వర్క్ కూడా ఉండదు. ఆపై నిమిషాల వ్యవధిలోనే లావాదేవీలు నిర్వహించుకోవచ్చు. ఈ కార్డు మొబైల్ ఫోన్‌లో ఉంటుంది కాబట్టి ఎప్పుడైనా వినియోగించుకోవచ్చు.
- ఈ కార్డు రూపే నెట్‌వర్క్‌పై పనిచేస్తుంది. ఎక్కడైనా ఆఫ్‌లైన్ మర్చంట్స్ లేదా ఆన్‌లైన్ షాపింగ్ అప్లికేషన్లలో చెల్లింపులకు వినియోగించుకోవచ్చు.
- పేమెంట్ ద్వారా వచ్చే రివార్డులను స్టార్‌గా వ్యవరిస్తారు. ఒక్కో స్టార్ ఒక్కో రూపాయితో సమానం. నెలాఖరు వరకు ఆగకుండా మీకు ఎప్పుడు అవసరమైతే అప్పుడు వీటిని వినియోగించుకోవచ్చు.
- గూగుల్ పే అప్లికేషన్ ద్వారా మీ లావాదేవీలను ట్రాక్ చేసుకోవచ్చు. యాప్ నుంచే బిల్లు పేమెంట్ చేయొచ్చు. లావాదేవీలను ఈఎంఐ కింద కన్వర్ట్ చేసుకునే అవకాశం కూడా ఉంది.
- ఈ క్రెడిట్ కార్డు యాప్‌లోనే ఉండడం వల్ల కార్డును సులువుగా మేనేజ్ చేయొచ్చు. కార్డు పరిమితులు, బ్లాక్ లేదా అన్‌బ్లాక్ చేయడం, పిన్ రీసెట్ చేసుకోవడం వంటివి గూగుల్ పే యాప్‌లోనే చేసుకోవచ్చు.




## జనవరి నుంచి జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ కార్ల ధరలు పైకి..

ప్రముఖ కార్ల తయారీ కంపెనీ జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా తమ కార్ల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. వచ్చే ఏడాది జనవరి 1 నుంచి కార్ల ధరలను 2 శాతం మేర పెంచుతున్నట్లు వెల్లడించింది. మోడల్‌ను బట్టి, వేరియంట్‌ను బట్టి ఈ పెంపు వర్తిస్తుందని గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. ఎంజీ హెక్టార్, ఎంజీఈ జడ్ఎస్ ఈవీ, ఎంజీ గ్లోస్టర్, ఎంజీ ఆస్టర్, ఎంజీ కామెట్, ఎంజీ విండ్సర్ వంటి మోడళ్లను దేశీయ మార్కెట్‌లో ఎంజీ మోటార్ విక్రయిస్తోంది. ముడిసరకు ధరలు పెరగడం, స్థూల ఆర్థిక అంశాల కారణంగా కార్ల ధరలు పెంచాల్సి వస్తోందని కంపెనీ తెలిపింది. తాము విక్రయించే అన్ని కార్లకూ ఈ పెంపు వర్తిస్తుందని తెలిపింది. ఇప్పటికే లగ్జరీ కార్ల తయారీ కంపెనీలు మెర్సిడెస్ బెంజ్ ఇండియా, బీఎండబ్ల్యూ జనవరి నుంచి తమ కార్ల ధరలు పెంచుతున్నట్లు ప్రకటించాయి. హ్యుందాయ్, హోండా, స్కోడా సైతం 2-3 శాతం మేర ధరలు పెంచుతున్నట్లు ప్రకటించాయి. మిగిలిన కంపెనీలూ త్వరలో ఈ తరహా ప్రకటన చేసే అవకాశం ఉంది. ఒక్క మహీంద్రా మాత్రమే జనవరిలో కార్ల ధరలు పెంచడం లేదని, భవిష్యత్‌లో ఉత్పత్తి వ్యయం పెరిగితే ధరల పెంపు చేపడతామని తెలిపింది.



# అల్లు అర్జున్ సిస్టర్‌గా మృణాల్ ఠాకూర్?

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కబోయే భారీ చిత్రంపై బన్నీ ఫ్యాన్స్‌తో పాటు సినీ ఇండస్ట్రీలోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ ప్రాజెక్ట్ అనౌన్స్‌మెంట్ వచ్చినప్పటి నుంచే అధికారిక అప్‌డేట్స్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా ఈ సినిమాకు సంబంధించిన మరో క్రేజీ టాక్ సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఈ మూవీలో బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్ కీలక పాత్రలో కనిపించనున్నట్టు ఇప్పటికే వార్తలు వచ్చాయి. అయితే తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం, మృణాల్ ఠాకూర్ ఈ సినిమాలో అల్లు అర్జున్‌కు సిస్టర్ రోల్‌లో నటించబోతున్నారట. ఈ పాత్ర కథలో చాలా కీలకమైనదిగా, బలమైన ఎమోషనల్ టోన్‌తో సాగుతుందని టాక్. అన్న-చె÷-లెల మధ్య బంధం, భావోద్వేగాలను అట్లీ తన మార్క్ స్టైల్‌లో చూపించబోతున్నాడని, ఈ పాత్ర ప్రేక్షకులను బాగా కనెక్ట్ చేస్తుందని అంటున్నారు. అయితే ఇది అధికారికంగా ధృవీకరించాల్సి ఉంది. నిజంగా మృణాల్ సిస్టర్ రోల్‌లో కనిపిస్తారా? లేక మరో షేడ్స్ ఉన్న క్యారెక్టర్‌లో వస్తారా? అన్నది వేచి చూడాల్సిందే. ఇక ఈ సినిమాకు సంబంధించిన మరో హైలైట్ ఏమిటంటే.. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పడుకోణె ఇందులో మెయిన్ హీరోయిన్‌గా నటించనుండగా, జాన్వీ కపూర్ మరో కీలక హీరోయిన్ పాత్రలో కనిపించనుంది. ఒకే సినిమాలో ఇంతమంది స్టార్ హీరోయిన్లు ఉండటం వల్ల ఈ ప్రాజెక్ట్‌పై మరింత క్రేజ్ పెరుగుతోంది. కథ విషయానికి వస్తే.. మాఫియా బ్యాక్‌డ్రాప్‌లో ఓ డాన్ చుట్టూ తిరిగే పవర్‌ఫుల్ కథను అట్లీ సిద్ధం చేశాడట. యాక్షన్, ఎమోషన్, డ్రామా అన్నీ సమపాళ్లలో ఉండేలా స్క్రిప్ట్‌ను రూపొందించినట్టు సమాచారం. అల్లు అర్జున్‌ను ఇప్పటివరకు ఎప్పుడూ చూడని విధంగా, ఒక కొత్త షేడ్స్ ఉన్న పాత్రలో చూపించేందుకు అట్లీ ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్టు తెలుస్తోంది.

# ఎవరూ ఊహించని ప్రమాదకరమైన ప్రయోగం చేశా..



కన్నడ బ్యూటీ రుక్మిణి వసంత్ ఇటీవల 'మదరాసి'తో ప్రేక్షకులను అలరించిన ఈ భామ 'కాంతార: చాప్టర్1' మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ప్రస్తుతం తెలుగులో యంగ్ టైగర్ ఎన్టీఆర్ సరసన ఓ భారీ ప్రాజెక్ట్‌లో నటిస్తోంది. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. దీంతో పాటు రుక్మిణి వసంత్ కోలీవుడ్, బాలీవుడ్ ఇండస్ట్రీల్లోనూ అవకాశాలు దక్కించుకుంటూ క్రేజీ హీరోయిన్‌గా రాణిస్తోంది. ఇదిలా ఉంటే.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రుక్మిణి ఆసక్తికర విషయాన్ని వెల్లడించింది. తాను రిషబ్ శెట్టి 'కాంతార:చాప్టర్1' విలన్‌గా నటించడంపై తన అనుభవాన్ని పంచుకుంది. కాంతారలో నేను విలన్ పాత్రలో నటించడం నా కెరీర్ ప్రారంభంలో చేసిన ఒక ప్రమాదకరమైన ప్రయోగం అని చెప్పాలి. ఎందుకంటే నేను నటించిన విలన్ పాత్రను ప్రజలు ఇష్టపడ్డారు కాబట్టి సరిపోయింది. లేకుంటే నన్ను ద్వేషించే వారు. ట్రోల్స్ చేసేవారు.. నా కెరీర్‌పై ప్రభావం చూపించేది. కానీ ప్రేక్షకులు అలా చేయలేదు. అలాగే నేను అందులో విలన్ పాత్రలో కనిపిస్తాని ఎవరూ ఉహించలేదు. అలాగే ప్రేక్షకులు నన్ను ఆదరిస్తారని అనుకోలేదని చెప్పింది. ప్రజెంట్ ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.


# నిధి అగర్వాల్‌కు చేదు అనుభవం



కొన్నిసార్లు అభిమానం హద్దులు దాటితే అది అభిమానంగా కాకుండా వేధింపుగా మారుతుంది. ముఖ్యంగా హీరోయిన్ల విషయంలో కొంతమంది అభిమానుల ప్రవర్తనపై ఇప్పటికే తీవ్ర విమర్శలు వస్తున్నాయి. తాజాగా ప్రభాస్ నటిస్తున్న 'రాజాసాబ్' హీరోయిన్ నిధి అగర్వాల్‌కు ఇలాంటి షాకింగ్ అనుభవమే ఎదురైంది. ఆమెను చుట్టుముట్టిన అభిమానులు తోసేసుకుంటూ హీరోయిన్‌పైకి ఎగబడిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రభాస్ హీరోగా నటిస్తున్న హారర్ కామెడీ థ్రిల్లర్ 'రాజాసాబ్'లో ముగ్గురు హీరోయిన్లలో నిధి అగర్వాల్ ఒకరు. ఈ చిత్రంలోని 'సహన సహన' పాటను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని లూలూ మాల్‌లో సాంగ్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు నిధి అగర్వాల్‌తో పాటు మరో హీరోయిన్ రిధి కుమార్ కూడా హాజరయ్యారు. సాంగ్ లాంచ్ కార్యక్రమానికి భారీగా అభిమానులు తరలివచ్చారు. ఈవెంట్ జరుగుతున్నంతసేపూ స్టేజ్ ముందు గుమిగూడిన అభిమానులు తోసుకుంటూనే కనిపించారు. అయితే ఈవెంట్ ముగిసిన తర్వాత పరిస్థితి మరింత దారుణంగా మారింది. నిధి అగర్వాల్ బయటకు వెళ్లే సమయంలో ఒక్కసారిగా అభిమానులు ఆమెపైకి ఎగబడారు. తోసుకుంటూ ముందుకు రావడం, చేతులు వేయడం వంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. సెక్యూరిటీ సిబ్బంది తీవ్రంగా శ్రమించడంతో చివరికి నిధి అగర్వాల్ కారులోకి ఎక్కగలిగింది. కారులో కూర్చోగానే ఆమె 'ఓ మై గాడ్' అంటూ షాక్‌కు గురైన దృశ్యాలు వీడియోల్లో కనిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా, ప్రభాస్ నటిస్తున్న 'రాజాసాబ్' సినిమా 2026 సంక్రాంతికి విడుదల కానుంది. జనవరి 9న థియేటర్లలో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది.

# రవితేజ మూవీకి చిరంజీవి వాయిస్ ఓవర్





మాస్ మహారాజా రవితేజ హీరోగా ఇటీవల చాలా చిత్రాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. అందులో ఏ చిత్రం కూడా పెద్దగా ప్రేక్షకులని అలరించలేకపోయింది. ఇప్పుడు ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన దర్శకుడు కిశోర్ తిరుమల దర్శకత్వంలో చేస్తున్న తాజా చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. ఇప్పటికే ఈ సినిమా అనౌన్స్‌మెంట్ నుంచే ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేపుతోంది. ఈ చిత్రంలో రవితేజ సరసన ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి హీరోయిన్లుగా నటిస్తుండగా, ఫుల్ లెంగ్త్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు బలమైన ఎమోషన్ కూడా ఉంటుందని టాక్ వినిపిస్తోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమాలో రవితేజ పాత్రను ప్రత్యేకంగా పరిచయం చేస్తూ మెగాస్టార్ చిరంజీవి తన స్వరంతో వాయిస్ ఓవర్ ఇవ్వబోతున్నారని తెలుస్తోంది. సినిమాలో కీలకమైన సందర్భాల్లో రవితేజ పాత్ర గురించి వచ్చే వాయిస్ ఓవర్‌ను చిరంజీవి చెప్పనున్నారని, ఇది కథకు మరింత వెయిట్ పెంచడమే కాకుండా సినిమాపై బలమైన ముద్ర వేయబోతుందని ఫిల్మ్ నగర్ వర్గాలు చెబుతున్నాయి. చిరంజీవి వాయిస్ ఓవర్ ఉండటం వల్లే సినిమాపై అంచనాలు మరో స్థాయికి చేరుకున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు ఈ చిత్రానికి సంబంధించిన డిజిటల్, శాటిలైట్ హక్కుల డీల్స్ కూడా భారీ ధరకు పూర్తయ్యాయి. ప్రముఖ జీ గ్రూప్ ఈ సినిమా హక్కులను భారీ మొత్తానికి సొంతం చేసుకున్నట్లు సమాచారం. థియేట్రికల్ రిలీజ్ తర్వాత జీ5 ఓటీటీ ఎ÷-లాట్‌ఫామ్‌లో ఈ సినిమా స్ట్రీమింగ్‌కు రానుండగా, శాటిలైట్ ప్రసారాన్ని జీ తెలుగు మరియు జీ సినిమా ఛానల్స్ నిర్వహించనున్నాయి. జీ స్టూడియోస్ సమర్పణలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే భీమ్స్ మ్యూజిక్‌పై ఉన్న క్రేజ్‌కు తోడు రవితేజ ఎనర్జీ, కిశోర్ తిరుమల కథనం కలిసి ఈ సినిమాను హిట్ ట్రాక్‌లో నిలబెడతాయనే నమ్మకం వ్యక్తమవుతోంది. ఫ్యామిలీ ఆడియన్స్‌తో పాటు మాస్ ప్రేక్షకులను కూడా ఆకట్టుకునే అంశాలతో 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సిద్ధమవుతోందని, రిలీజ్ దగ్గరపడే కొద్దీ ఈ సినిమాపై అంచనాలు మరింత పెరుగుతున్నాయని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# దురంధర్‌తో సత్తా చాటిన అక్షయ్ ఖన్నా



'ధురంధర్' వంటి సూపర్ హిట్ సినిమాతో సీనియర్ నటుడు అక్షయ్ ఖన్నా క్రేజ్ మరోసారి ఆకాశాన్ని తాకింది. రణవీర్ సింగ్ హీరోగా నటించిన ఈ సినిమాలో అక్షయ్ ఖన్నా రెహ్మాన్ డకైట్ అనే పవర్‌ఫుల్ నెగటివ్ పాత్రలో నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. విలన్ అయినప్పటికీ హీరోకంటే ఎక్కువ ప్రశంసలు దక్కడం ఆయన నటనకు నిదర్శనంగా మారింది. ప్రతి సీన్‌లో తనదైన స్టైల్, ఇంపాక్ట్‌తో మెరిసిన అక్షయ్ ఖన్నా 'ధురంధర్' సినిమాకు ప్రధాన బలంగా నిలిచారు. ఇదే ఏడాది ప్రారంభంలో విక్కీ కౌశల్ హీరోగా నటించిన 'చావా' సినిమాలో ఔరంగజేబు పాత్రలో అద్భుతమైన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకున్న ఆయన, ఇప్పుడు 'ధురంధర్'తో మరోసారి తన సత్తా చాటారు. కథ, పాత్ర ఏదైనా సరే.. తెరపై కనిపిస్తే తనదైన ముద్ర వేయడం అక్షయ్ ఖన్నాకే చెల్లింది అని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. ఇక సినిమాలతో పాటు అక్షయ్ ఖన్నా వ్యక్తిగత జీవితం కూడా తరచూ చర్చకు వస్తుంటుంది. ప్రస్తుతం ఆయన వయసు సుమారు 50 సంవత్సరాలు. అయినప్పటికీ ఇప్పటివరకు పెళ్లి చేసుకోలేదు. దీనిపై గతంలో ఓ మీడియా ఇంటర్వ్యూలో అక్షయ్ ఖన్నా చాలా స్పష్టంగా మాట్లాడారు. 'నాకు బాధ్యతలు వద్దు. నేను ఒంటరిగా ఉండటానికే ఇష్టపడతాను. ఎవరి గురించి ఆందోళన చెందకుండా నా జీవితాన్ని నేను ఆస్వాదించాలనుకుంటాను. నాకు ఇప్పుడు ఉన్న జీవితం చాలా బాగుంది. దాన్ని ఎందుకు మార్చుకోవాలని ఆయన వ్యాఖ్యానించారు. అక్షయ్ ఖన్నా ప్రముఖ బాలీవుడ్ నటుడు వినోద్ ఖన్నా కుమారుడు. 2025 నాటికి ఆయన మొత్తం ఆస్తులు సుమారు రూ.167 కోట్లుగా అంచనా వేయబడుతున్నాయి. దేశంలోని పలు ప్రాంతాల్లో బంగ్లాలు, విలాసవంతమైన కార్లు ఆయన సొంతం. సినిమాలతో పాటు రియల్ ఎస్టేట్ పెట్టుబడుల ద్వారా కూడా భారీగా సంపాదిస్తున్నారు. నటుడిగా, వ్యక్తిగా తనదైన మార్గంలో ముందుకు సాగుతున్న అక్షయ్ ఖన్నా, పెళ్లి లేకుండానే సంతృప్తికరమైన జీవితాన్ని గడుపుతూ బాలీవుడ్‌లో తన ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకుంటున్నారు. 'ధురంధర్' విజయంతో ఆయనకు మరిన్ని ఆసక్తికర పాత్రలు రావడం ఖాయమని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

# రెండు ఓటిటిల్లోకి సంతాన ప్రాప్తిరస్తు



ప్రేమ, కెరీర్, రిలేషన్‌షిప్స్ మాత్రమే కాదు, ఈతరం చెప్పలేనంత సున్నితమైన సమస్యలతో కూడా సంఘర్షణ పడుతోంది. అందులో ఒకటి సంతాన లేమి. బయటికి మాట్లాడాలంటే సంకోచం, లోపల వేల సందేహాలు, వందల ఒత్తిడులు. అలాంటి సున్నితమైన విషయాన్ని కథగా మలచుకున్న సినిమా 'సంతాన ప్రాప్తిరస్తు'. విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటించిన ఈ సినిమాకు సంజీవ్ రెడ్డి దర్శకత్వం వహించాడు. నవంబర్ 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. అయితే ఇప్పుడి ఇదే చిత్రం తాజాగా రెండు ఓటీటీల్లో విడుదల కానుంది. 'అమెజాన్ ప్రైమ్ వీడియో', 'జియో హాట్‌స్టార్'లో ఈ నెల 19 నుంచి స్ట్రీమింగ్ కాబోతున్నట్లు ప్రకటించింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. చైతన్య (విక్రాంత్) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఓ ఎగ్జామ్ సెంటర్ లో కల్యాణి (చాందిని చౌదరి) ను చూసి ప్రేమలో పడతాడు. ఇద్దరూ దగ్గరౌతారు. కల్యాణి తండ్రి ఈశ్వరరావు (మురళీధర్ గౌడ్) వీరి ప్రేమని వ్యతిరేకించడంతో ఇద్దరూ పారిపోయి పెళ్లి చేసుకుంటారు. త్వరగా బిడ్డని కనేస్తే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని భావిస్తాడు చైతు. కాకపోతే పిల్లల విషయంలో తన ప్రయత్నాలు ఫలించవు. దీంతో ఓ సంతాన సాఫల్య కేంద్రాన్ని ఆశ్రయిస్తాడు. వైద్య పరీక్షలు చేయించుకోగా చైతన్యకి ఓ సమస్య ఉన్నట్లు బయట పడుతుంది. తర్వాత ఏం జరిగింది? తన సమస్య కారణంగా చైతన్య ఎలాంటి పరిస్థితులు ఎదురుకున్నాడు? చివరకు చైతన్య, కల్యాణికి పిల్లలు పుట్టారా లేదా ?అనేది మిగతా కథ.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com